జూలై 2008

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



యెహోవా...

నా తల్లిగర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే

నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా

భయమును ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి.

అందును బట్టి నేను నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను

కీర్తన 139

# స్పందన
ఆధ్యాత్మిక మాస పత్రిక

1976 - 2008 32 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

*The largest circulated Telugu monthly since 32 years*

అక్టోబర్ 2008 | సంపుటి 32 | సంచిక 10



వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు : ఆచార్య ఆరార్కే మూర్తి

ప్రచురణకర్త, సంపాదకులు : డా॥ దేవసహాయం దండల

గౌరవ సంపాదకులు : డా॥ జ్ఞాన భాస్కర్

సహకారం : పాస్టర్ పి. సురేశ్ బాబు

సంపాదక వర్గం : బ్రదర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, రెవ. కె. జాన్ మోజెస్ శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్

సహాయ సంపాదకులు : బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్ అబ్రహాం


## ఈ సంచికలో


మాటలు, మాటలు

నవనూతనం

బాలస్పందన

విధేయత

ప్రేమమయుడు

నిర్గమకాండం

క్లుప్త ప్రసంగాలు

గల్లనుడాల కట్టు


## చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 100 | $ 20 |
| జీవిత సభ్యత్వం | రూ. 1000 | $150 |
| పోషక సభ్యత్వం | రూ. 100 (ప్రతినెల) | $2 0 |

అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.100 గానే ఉంచాము. వాస్తవానికి రెట్టింపు ఖర్చవుతుంది. పత్రిక చందాకు మించి పరిచర్య అభివృద్ధి కోసం కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన SPANDANA పేరు మీద ఈ క్రింది అడ్రస్‌కు పంపాలి. మీ కానుక అందిన వెంటనే స్పందన ఆఫీసు నుండి ఉత్తరం రాస్తాము.


**స్పందన ఆధ్యాత్మిక మాస పత్రిక**

పోస్టు బాక్సు 415, దుర్గాగ్రహారం, విజయవాడ- 520002, ఫోన్ (0866) 2456547
సెల్ - 9490113300 లేదా 994833522

E-mail : read_spandana@yahoo.com / saviorsheartbeat@gmail.com

*Founder & Chief Editor* ACHARYA R. R. K MURTHY

Printed, Published and owned by DEVASAHAYAM DANDALA
Printed at Spandana Offset Printers, For Spandana Graphics & Published from
# 30-3-13, Durga Agraharam, VIJ - 2.

# సంపాదకీయం

పరిశుద్ధాత్మ పరిశుద్ధ పరిచే ఆత్మ! మనల్ను కడుగుతాడు, మనల్ను పరిశుద్ధ పరుస్తాడు. పరిశుద్ధాత్మ మనల్ను యేసుక్రీస్తుతో ఆయన శీలముతో నింపుతాడు. అందుకే మనలను మన విశ్వాసమును బట్టి దేవుడు నీతిమంతులుగా పరిగణిస్తున్నాడు. మతం మానవ కల్పితమైన వ్యవస్థ. క్రైస్తవం, మత లక్షణాలు లేని ఆధ్యాత్మిక ఉద్యమం. కొందరు మతాన్ని దేవుడితో జత పరుస్తారు. మతాలు అనేకములున్నాయి. మతాలు సృష్టించిన దేవుళ్ళు దేవతలు అనేకానేకాలు. సంస్కృతి ఆచార సంస్కారాలు ఆయా మతాలకు సంకేతాలై కూచున్నాయి. క్రైస్తవం అంటే క్రీస్తు. ఆయన సౌశీల్యం, ఆయన వ్యక్తిత్వం. ఆయన ఉద్యమం. దీన్నే క్రైస్తవమని వ్యవహరిస్తాము. పరిశుద్ధాత్మ విశ్వాసిలో ఆధ్యాత్మిక స్పృహను కలిగిస్తాడు. క్రీస్తును గురించి ఆసక్తి విశ్వాసిని తినేటంత తీవ్రస్థాయిలో ఉత్కంఠ కలిగిస్తాడు. క్రైస్తవ దృక్పథంలో మతం అనేది తప్పు అంచనా. మతాచారాలు, మత క్రమశిక్షణలు ఇవే క్రైస్తవమనుకుంటే అది అపచారం. కృపకు కేవలం విరుద్ధ లక్షణాలు కలిగినదే మతం. విశ్వాసి లోకంలో తల. ఎవరికీ విశ్వాసి తోక కాదు, కాకూడదు. నాయకుడు తల అయితే అతణ్ని వెండించేవారు తోకలు. ఇది లోకంలోని విధానం. కాని క్రైస్తవ నాయకులు నాయకులను తయారు చేస్తారు. తోకల్ను కాదు. యేసుప్రభువు తనలాంటి వారిని నాయకులు అన్నాడు. నా పనులు నాలాగే, ఇంకా అంతకంటే బాగా చేస్తే చాలు అన్నాడు. యేసు సృజనాత్మకతను ప్రోత్సహించాడు. యేసు మనకు ప్రేమనేర్పాడు. మనల్ను ప్రేమించి, ప్రేమ అంటే ఏమిటో చూపాడు. మనం డబ్బు కోసం పని చెయ్యము. ఇతరులకు చేసే ప్రేమ పూర్వకమైన సేవే మనది. డబ్బుకోసం పని అనేది యేసు పద్ధతి కాదు. రక్షింపబడిన వ్యక్తి పరోపకారార్ధమై పని చేస్తాడు. యేసు పనిచేసే దేవుడు, ఆయన కార్మికుడుగా పని చేశాడు. పనికి కాదు. రక్షించబడిన వ్యక్తుల పనికి దేవుని గుర్తింపు ఉంది . ఎఫెసీ 4.28. దొంగిలేవాడు ఇక మీదట దొంగిలక అక్కర గలవానికి పంచి పెట్టటానికి వీలు కలిగే నిమిత్తము తన చేతులతో మంచి పని చేస్తూ కష్టపడాలి. తప్పిపోయిన కుమారుడు పందుల మధ్య ఉండగా బుద్ధి వచ్చింది. తీర్మానం చేసుకున్నాడు. ఇక మీదట అతడు తండ్రిది దిగమింగి వెయ్యడు. కూలిపని చేసైనా సరే సంపాదించి తండ్రి చేతికిస్తాడు. ఇకమీదట అతడు పరాన్నభుక్కు కాదు. యేసు సచ్చిదానందుడు. ఆమెన్.

క్రీస్తు నందు భవదీయుడు మీ **ఆరార్కెమూర్తి**

## మనలో మాట

క్రీస్తునందు మా ప్రియ పాఠకులకు,

శుభాకాంక్షలు. దేవుని వాక్యం ఈ విధంగా తెలియజేస్తుంది. సామెతలు 6.2 నీ నోటి మాటల వలన నీవు చిక్కుబడి యున్నావు. నీ నోటి మాటలవలన పట్టబడియున్నావు. దయచేసి ఈ మాటలను చాలా జాగ్రత్తగా గమనించండి. కారణమేమంటే నీ విజయం నీ నోట్లోనే ఉంది. బాగా గుర్తుంచుకోండి, ఉదయం లేచిన దగ్గరనుండి ఓడిపోయినట్లు, దిగాలుగా, విశ్వాసరాహిత్యపు మాటలు నీ నోటివెంట వస్తూ, దేవుని ఆశ్చర్య అద్భుత కార్యాలను నీ జీవితంలో చూడాలంటే అది అసాధ్యం! దేవుని వాక్య వాగ్దానాలతో నీవు నింపబడి జీవితంలో నీవు ఎదుర్కొనే ప్రతి పరిస్థితులకు దేవుని వాక్యం ఏమి పరిష్కారం చెబుతుందో వాటిని జ్ఞాపకం చేసుకుంటూ, నోటితో వాటిని ఒప్పుకుంటూ ఉండాలి. ఉదాహరణకు నీవు ఆర్థిక సమస్యల్లో ఉన్నావు. దేవుని వాక్యప్రకారం నీవు జీవిస్తున్నావు. దేవుని వాగ్దానం ఫిలిప్పీ 4.19 దేవుడు తన మహిమైశ్వర్యంలో ప్రతి అవసరత తీరుస్తాడు. ఇలాంటి వాగ్దానాలు నీకు గుర్తుకు రావాలి, ఆ వాగ్దానాన్నే మననం చేస్తూ ఉండాలి గాని సైతాను తెచ్చే వ్యతిరేఖ ఆలోచనలకు తావివ్వకూడదు. అలాగే ఆరోగ్యం సరిగా లేదు, నిర్గమకాండం 26.15 'నిన్ను స్వస్థ పరచు యెహోవాను నేనే' అనే వాగ్దానం నీ మనసును, నీ ఆలోచనలను పరిపాలించాలి. అప్పుడు నీవు అనారోగ్యాన్ని జయించగలవు. జీవితంలో కొన్ని పరిస్థితులుంటాయి, అవి చాలా కాలం నుండి ఎండిపోయినట్టే ఉన్నాయి. ఈ మాటలు చదువుతోన్న నీ వివాహజీవితం ఎండిపోయినట్టుందేమో. ఒకవేళ మీ సంబంధ బాంధవ్యాలు ఎండిపోయినట్టున్నాయేమో? నీ ఆర్థికస్థితిగతులు ఎండిపోయినట్టున్నాయి. నీ ఆరోగ్యం బాగోటం లేదు. నీ మనసు వికావికలైపోతోంది. నీ ఉద్రేకాలు సరిగా ఉండటం లేదు. లేదా పళ్ల బిగింపుతో జీవితాన్ని ఈడ్చుకొస్తున్నావు. నీకు విడుదల కావాలంటే, మార్పు కావాలని నీవు కోరుకుంటే, చైతన్యం లేదా ఉజ్జీవం కావాలంటే దేవుని మాట ఏమంటే, పరిష్కారం నీ నోట్లోనే ఉంది. అది దేవుని ఇష్టంలో కాదు, నీ ఇష్టంలో ఉంది. గమనించండి! నీ నాశనాన్ని నీవే ప్రవచించు కోవచ్చు లేదా దేవుని వాక్యవాగ్ధానాల మీద ఆధారపడి ధైర్యంగా 'నేను జీవిస్తాను, చావను' అని నీవు వెల్లడి చేయవచ్చు. "క్రీస్తునందు ఆరోగ్యం నాదే, అని గట్టిగా చెప్పు. దేవుడు నన్ను దీవిస్తాడు. పరలోక ఆనందం నాదే! నా కుటుంబంలో పరిస్థితులన్నీ బాగవుతాయి, అని విశ్వాసంతో వెల్లడి చేయ్. నాకు అవసరమయిన పనిని దేవుడిస్తాడు". దేవుడు నీకు ఏది ఇవ్వాలని నిర్ణయించాడో దానిని ఎవ్వరూ, ఏ సైతాను శక్తులూ ఆపలేవు. దేవుడు చెప్పాడు, ఆ మాటల్నే నేనూ ధైర్యంగా చెబుతాను. ఒక్క మాటలో చెప్పాలంటే నీ విజయం నీ నోట్లోనే ఉంది. ఈ క్షణం నుండి నీ నోటి మాటలకు జాగ్రత్తగా వినియోగించటానికి పరిశుద్ధాత్మ దేవుడు మిమ్మును ప్రత్యేకంగా అభిషేకించును గాక!

ఆత్మల సేవలో మీ సోదరుడు - దేవ

ఈ తరానికి ప్రసంగము



ఆచార్య ఆచార్య

# మాటలు మాటలు

**ప్రతిమనిషి** మాట్లాడాలని కోరతాడు. భాష మానవుడికి దేవుడిచ్చిన వరం ఇద్దరు వ్యక్తులు ఒకరితో ఒకరు మాట్లాడుకొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నీవు మాట్లాడేది అవతలి వ్యక్తి వినాలి. అలాగే ఆ వ్యక్తి మాట్లాడేది నీవు వినాలి. మాట్లాడటము వినడము ఈ రెండింటిలో వినడమే మంచి స్నేహితానికి దారి తీస్తుంది.

## దేవుని మాటలు – సైతాను మాటలు

మాటలు సరిగా వాడితే అవి ఇతరుల మీద గొప్ప ప్రభావం చూపెడతాయి. సృష్టి ఎలా ఉనికిలోనికి వచ్చింది? దేవుడు మాట్లాడాడు, దానికి ఫలితంగా సృష్టిలో ప్రతిఒక్కటి కలిగింది. ఆదాము గొప్ప పండితుడు. అతడే ఒక నిఘంటువు. సృష్టిలో ప్రతిదానికి పేర్లు పెట్టింది ఆదామే. అలాగే దేవుని బిడ్డలు దేవుడిచ్చిన భాషను నిర్మాణాత్మకంగా వాడాలి మాటలన్నిటిలోనికి గొప్ప మాట "యేసు" ఇది రెండక్షరాల మాట. సామెతలు 18:21 అంటోంది. **జీవమరణములు నాలుక వశము.** నీ మాటలతో కట్టగలవు. పడగొట్టగలవు కూడా. విశ్వాసులూ జాగ్రత్త ! అవివేకంగా మాట్లాడి ఇతరుల జీవితాలలో చిచ్చుపెట్టొద్దు.

యేసు మాట్లాడినట్లే మాట్లాడడం నేర్చుకోవాలి. నాలుగు సువార్తలలో యేసు చెప్పిన మాటలలోనే స్పష్టత వుంది. కీర్తనలు 64:1-4 దావీదు దేవుణ్ని అడుగుతున్నాడు. **"దేవా నా మనవి ఆలకించు నన్ను కాపాడు. అల్లరి మనుష్యుల మధ్య ఉన్నాను. వారి నుండి నన్ను దాచు. నా చుట్టూరా వున్న మనుష్యులు పలికే మాటలు పదునైన కత్తిలాంటివి. ఆ కత్తికి వారు బాగా సానపెడతారు. పదును పెడతారు. వారి మాటలు బాణాలు. యధార్థవంతులను మాటల బాణాలతో హింసిస్తారు. వారికి భక్తిలేదు భయమూ లేదు".**

## జ్ఞానుల నాలుక

జ్ఞానుల నాలుక ఆరోగ్యదాయకం అంటోంది బైబిలు. తిట్లు ఏ భాషలోనైనా భయంకరమైన ఫలితాలనిస్తాయి. ఎగతాళి,

సరసాలు, అసభ్యమైన పాటలు మాటలు సమాజంలో కొరుకుడు పుండులాంటివి. ఏమీ మాట్లాడకుండా ఉంటే మంచిదా! అలాకాదు మాటల వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయి. దేవుడి మాటలు నేర్చుకుందాము. సైతాను మాటలను మన హృదయాలలోనుండి చెరిపివేద్దాం.

## జీవపు మాటలు - గాయపు మాటలు

మౌనం కొన్ని సమయాలలో చెడు ఫలితాలనిస్తుంది. మూగతనం శాపం. మన దేవుడు మాట్లాడే దేవుడు. అలాంటి దేవుడితో మనకు సంబంధ సహవాసాలున్నాయి. తరతరాల మౌనాన్ని భంగం చేస్తూ నిత్యత్వపు మౌనాన్ని ఒక్కమాటతో తొలగించి వెలుగు కలుగు గాక అన్నాడు. మాట్లాడే దేవుడిని మనం ఎరుగుదుము. లోకంలో మతాలలో మాట్లాడని మూగ దేవుళ్ళు ఎందరో వున్నారు. మాట్లాడండి. సైతాను, భాషలో ప్రవేశ పెట్టిన చెడ్డమాటలను బహిష్కరించండి. నీతిమంతులు జీవప్రదమైన మాటలు పలుకుతారు. క్రీస్తుకు బయట ఉన్నవారు దౌర్జన్యాన్ని రెచ్చగొట్టే మాటలు పలుకుతారు. ఎవడు జ్ఞాని? ప్రజల జీవితాలను బాగుచేసే మాటలు రక్షణాభ్యుదయాన్ని కలిగించే మాటలు చెప్పగలవాడే జ్ఞాని. మీరు "సామెతలు" గ్రంధాన్ని జాగ్రత్తగా చదవండి. సొలొమోను ఉదహరించిన సామెతలన్నీ సామాజిక స్పృహను కలిగిస్తాయి. మనిషి నుండి మనిషికి మాటల ద్వారానే జ్ఞానం బదిలీ అవుతుంది. ఒకసారి పేతురు ప్రభువుతో అన్నాడు. **"ప్రభూ మేము ఎక్కడికి పోతాము?. నీవద్ద నిత్యజీవపు మాటలున్నాయి"**. ఉద్రేకాలను రెచ్చగొట్టే మాటలు ఇతరులను కించపరిచే మాటలు తోటివారిని అవమానపరిచే మాటలు ఇతరుల మనసును గాయపరిచే మాటలు మానండి. మాట్లాడటం అనిచెప్పి మాటలతో ఇష్టం వచ్చినట్లు ఆడుకోవద్దు. తల్లులారా మీరు పిల్లలను పెంచేటప్పుడు వాళ్ళను తిట్టవద్దు. నీవు ఎందుకూ పనికి రావు అని అనొద్దు. నీవు పుట్టకుండా ఉంటే బాగుండు అని శపించవద్దు. నిన్నెందుకు పెళ్ళాడానో. పెళ్ళాడి పెద్ద తప్పు చేశాను అని ఏ భర్తా అనకూడదు. పిచ్చికూతలు కూయడానికి మనం పశువులంకాదు. తీతువు పిట్టలం కాదు. ఆయుధంతో కొట్టే దెబ్బల కంటె మాటలదెబ్బలు లోతైన గాయాలు కలిగిస్తాయి. స్వస్థపరిచే మాటలు మాట్లాడండి. యేసు మాటల్ని పరిశుద్ధాత్మ మనకు నేర్పుతాడు. దేవుడు మనకిచ్చిన భాషను శ్రావ్యంగా, సుతారంగా, కమ్మగా మాట్లాడి ప్రభువు వైపునకు వారిని ఆకర్షించాలి.

సామెతలు 24:31 ఒక వ్యక్తి జీవితంలో ముండ్లతుప్పలు గచ్చపొదలు ఎక్కువ అవుతున్నాయి. అంటే దానికి కారణం అబద్ధాలు, మోసపుమాటలు, కక్షసాధింపుమనస్తత్వాలు తెలివిలేనివాని బతుకు అతని మాటల వలన పాడైపోతుంది. మనం మాట్లాడే మాటలకు దేవుడు ఆమేన్

అనేటట్లు ఉండాలి. అననీయ సప్పీరాలు దేవుడికి అబద్ధం చెప్పి నాశనమైపోయారు. సామెతలు 21:5 చెపుతోంది **"శ్రద్ధగల వారి యోచనలు లాభకరమైనవి తాలిమిలేని పనిచేసేవారికి నష్టం ప్రాప్తిస్తుంది".** మరోమాట. ఎవరికీ అర్థం కాని మాటలు మాట్లాడవద్దు. మాటల వెనుక దాక్కోవద్దు. వేషధారణ మాటలు చెడు ఫలితాలనిస్తాయి. దేవుని వాక్యం రాయబడింది. కాని అది మొదట పలుకబడింది. మాట మొదట వచ్చింది తరువాత రాత వచ్చింది. మాట్లాడినట్లే రాయడం అది దేవుని కృప. రానురాను మానవుడు మాటకు రాతకు మధ్యదూరం ఎక్కువ చేస్తూవచ్చాడు. పుస్తకాల పండితులు ఎక్కువయ్యారు. వారి వల్ల సమాజానికి ఎట్టి ప్రయోజనమూ లేదు.

## సువార్త మాటలు - యాంత్రిక మాటలు

దేవుని మాటలు మాట్లాడినట్లే ఉండాలి. నిర్జీవ గ్రంధంలాగా ధ్వనించకూడదు. జాగ్రత్త ! కృత్రిమ భాషలో భోధించే భోదకులారా, మీకు శ్రమ! సువార్తను మామూలుగా మనం మాట్లాడు కొనే భాషలో బోధించండి. అది బోధించినట్లుగా ఉండకూడదు నోటి మాటల్లాగా ధ్వనించాలి. వాక్యము శరీరధారియై మన మధ్యకు రావడంలో ఉద్దేశ్యం ఏమిటి? అలా ప్రభువు రాకపోతే అంతా పుస్తకాలకెక్కేది. యేసు స్వయంగా మాట్లాడుతున్నట్లు ధ్వనించినప్పుడే అది పరిశుద్ధాత్మ స్వరం. మామూలు మాటలలో కబుర్లలో సువార్తను చెప్పలేనివారు చదువు రాని ప్రజలకు అమాయికులకు చాలా ద్రోహం చేస్తున్నారు. యేసు సువార్తను కాగితం మీద వ్రాసి పంపలేదు. తానే సువార్తయై మన మధ్యకు వచ్చాడు.

## ఫలశృతి

ప్రియక్రైస్తవ సోదరీ సోదరులారా సువార్తను మాట్లాడండి. పెద్ద పెద్ద మాటలు పెట్టి ఎవరికీ అర్థం కాకుండా ప్రసంగ వేదికలను బాదినంతమాత్రాన ప్రయోజనం ఉండబోదు. కూలీలు క్రైస్తవులైతే పని చేసుకొంటూ క్రైస్తవ పాటలు పాడాలి. క్రైస్తవ తల్లులు సువార్తను జోల పాటలలో వ్యక్తం చేయాలి. సువార్త మాటలను చిన్నప్పటి నుండి తల్లితండ్రుల నోట విని తాము మాట్లాడాలి లేకపోతే మనకు క్రైస్తవ మతం మిగులుతోంది గాని క్రీస్తు ఉండడు.

మరోమాట చెబుతాను. కంప్యూటర్ల యుగంలో ఒకరితో ఒకరు మాట్లాడకోవడం యాంత్రికమైపోతోంది. కంప్యూటర్ పిచ్చోళ్ళు ఎక్కువౌవుతున్నారు జాగ్రత్త. భార్యభర్తలు, కుటుంబం, పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకొనే స్థితి అంతరించిపోయింది జీవితం సంకుచితమైపోయింది. మనం ఒకరికి ఒకరం దూరమైపోతున్న కొద్దీ దేవునికి దూరమైపోతున్నాం. సమాజమా నీ గమ్యం ఏది ! యేసుక్రీస్తు మనకు తన మాటల్ను పరస్పర సహవాస అనుభవాన్ని తిరిగి ఇచ్చి మనలను ఉజ్జీవపరచును గాక




# స్పందన - ప్రతి స్పందన

## ఎన్నో మేళ్ళు

మీరు పంపుచున్న స్పందన పత్రిక క్రమంగా అందుచున్నది. స్పందన వలన మేము ఎన్నో ఆధ్యాతిక మేళ్లు అనుభవిస్తున్నాము.

**ఎస్. సుశీలదాస్, ఎల్లరెడ్డి పేట.**

స్పందన పత్రిక ద్వారా ఆధ్యాత్మికంగా మెమేంతో మేలు పొందుచున్నాము.

**కె.ఎస్. జాషువా, బస్తర్ జిల్లా**

## ఆధ్యాత్మిక సత్యాలు

మీ స్పందన పత్రిక చదువుతున్నంత సేపు ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలు గ్రహించుచున్నాము. మా కుటుంబము కొరకు ప్రార్థించగలరు.

**కె.ప్రమీలప్రభాకర్, చిత్తూరు**

## బలపడుతున్నాము

మీరు పంపుతున్న స్పందన పత్రిక చదివి, ఆరార్కేమూర్తిగారు అందిస్తున్న ప్రసంగాలు టి.వి. ద్వారా విని ఎంతో ఆత్మీయంగా బలపడుతున్నాము. నా ఆరోగ్యం కోసం, మా కుటుంబము కొరకు ప్రార్థించగలరు.

**బి. అర్జునరావు, గుడివాడ.**

స్పందన పత్రిక వలన నేను ఆత్మీయంగా బలపడి ఆశీర్వదింపబడుతున్నాను.

**శ్రీమతి రూతుక్రీస్తుదాస్, హైదారబాదు**

## ప్రభావితం

మీ యొక్క స్పందన ఆధ్యాత్మిక కార్యక్రమాలు క్రమముగా చూస్తు ఉంటాము. దేవసహాయం గారికి నా హృదయపూర్వక వందనములు. అయ్యగారు మీ యొక్క ప్రసంగములు మమ్ములను ఎంతగానో ప్రభావితం చేయుచున్నవి. మరియు మా కుటుంబమును దేవుడు ఎంతగానో ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయుచున్నారు. మీ యొక్క కార్యక్రమము ఇంకా అనేకమందికి ఆశీర్వాదకరముగా ఉండాలని ఆశించుచున్నాము.

**యం. దేవిడ్‌రాజు, పెదపూడి మం॥**

## మేలుకొలుపు

మీరు ప్రచురించుచున్న స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక మా జీవితములకు ఒక మేలుకొలుపుగా వున్నది. మాకు ఆత్మీయ ఆహారం అందించుచున్న మీకు వందనములు. నా కుమారుని ఆరోగ్యం కొరకు ప్రార్థించగలరు.

**పి.జేమ్స్, నంద్యాల.**

## మాట్లాడినట్టు

ప్రభువైన యేసుక్రీస్తునామములో మూర్తినాయునగారికి, దేవసహాయం అయ్యగారికి వందనములు. కుటుంబసదస్సు నంధ్యాలలో జరిగినపుడు మేము కూటానికి వచ్చాము. భార్యభర్తలు కుటుంబములో ఎలా మెలగాలి, పిల్లలతో తల్లితండ్రులు ఎలావుండాలి దేవునితో ఏలాంటి సంబంధం కలిగి ఉండాలి అనే అంశం మాకెంతో నచ్చింది. మీ పత్రిక మాకు ప్రతినెలా వస్తుంది. పత్రిక చదివితే మీతో మాట్లాడినట్లు ఉంటుంది. మా కుటుంబము కోసం ప్రార్థించగలరు.

**జి. వెంకటమ్మ, నంధ్యాల**

ఆధ్యాత్మిక లోతులు

# నవ నూతనం

డా॥ దేవసహాయం



"ఆ పండుగలో మహా దినమైన అంత్యదినమున యేసు నిలిచి - ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజల నదులు పారునని బిగ్గరగా చెప్పెను. తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను" (యోహాను 7:37-39)

## నూతన సంబంధం : దేవుని సన్నిధి వరము

ప్రభువు వారు ఇక్కడ ఓ శ్రేష్టమైన విషయాన్ని తెలియజేస్తున్నారు. ఆయన యందు విశ్వాసముంచే వ్యక్తిలో దేవుని ఆత్మ నివాసం! శరీర సంబంధమయిన వ్యక్తి ఈ విషయాలను అర్థం చేసుకోలేడు. మీకు గుర్తుందా యేసు మరణానికి ముందు రాత్రి ఆయన శిష్యులతో మాట్లాడుతూ, తాను తండ్రి వద్దకు వెళ్లిన తరువాత **ఆదరణకర్తను** పంపుతాను అన్నాడు. ఆయన సత్యాత్మ అని, వారిలో **నివసిస్తాడని** చెప్పాడు. **"ఆయన మీతో కూడా నివసిస్తాడు, మీలో ఉంటాడు."** యోహాను. 14. 15-17, 23. భక్త పౌలు ఈ విషయాన్ని ధృవీకరిస్తూ 1 కొరింథీ 6.19 లో **"మీ దేహము దేవుని వలన అనుగ్రహింపబడి మీలో ఉన్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరు ఎరుగరా?"** అంటున్నాడు.

గమనించాలి. ఇది ఎలా, ఎప్పుడు జరుగుతుంది. ఈ విషయాన్నే ఎఫెసు విశ్వాసులకు భక్తుడు రాస్తూ ఇలా వివరించాడు. **"మీరూ సత్య వాక్యాన్ని, అనగా మీ రక్షణ సువార్త** విని, **క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రించబడ్డారు.... ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు".** ఎఫెసి 1:13-14. ఆ "ముద్ర" విశ్వాసి దేవుని కుటుంబంలో సభ్యుడని తెలియజేసే అధికారిక ముద్ర. ఈ లోకంలో మనం జీవించినంత కాలం మనకు తోడుగా ఉంటాడని, ఈ జీవితం తరువాత మనకు నిత్యజీవాన్ని ప్రసాదిస్తాడని - ఇలా ముందు జరగబోయే ధన్యతను స్థిరపరచేదే ఆ "సంచకరువు" అడ్వాన్స్.

యేసు క్రీస్తును అంగీకరించిన వ్యక్తి జీవితంలో పరిశుద్ధాత్ముడు జీవిస్తాడు. అందు చేత పరిశుద్ధాత్మ నైజం మనం అర్థం చేసుకుని

తీరాలి. అందుకే ప్రభువు నికోదేము తో అంత ఖచ్చితంగా మాట్లాడాల్సి వచ్చింది. అతడు మత నిష్ఠగల పరిసయ్యుల పక్షంవాడు. యోహాను 3:1-18. ఉన్నతమైన నైతిక విలువలుగల నాయకుడు. అయితే ఆ యోగ్యతల వల్ల మాత్రమే అతడు పరలోకం (దేవుని రాజ్యం) లోనికి వెళ్లలేడని యేసు చెప్పాడు. అతడు **"ఆత్మ మూలముగా జన్మించాలి''** అని యేసు చెప్పాడు. అక్షరార్థంగా - మరల జన్మించటం లేదా తిరిగి జన్మించటం అనేది పైనుండి దేవుడు అనుగ్రహించే నవజీవనం, సరికొత్త జీవితం!!

మతసంబంధమైన క్రైస్తవులు తమ పరిస్థితులన్నీ బాగున్నాయి గనుక పరలోకానికి నేరుగా వెడతాము అనుకుంటారు. కాస్తంత కష్టపడి ప్రయత్నిస్తే పరలోకాన్ని ఆర్జించవచ్చునని వారి నమ్మకం. అలాంటి అంచనాలో ప్రియ పాఠకా ఒకవేళ నీవూ ఉన్నావేమో! బాగా గుర్తుంచుకోవాలి. మనం ఎప్పుడు నిజమైన క్రైస్తవులము అవుతాము? ప్రభువు ఏం చెప్పారు? గ్రహించాలి. విశ్వాసంతో దేవునికి నీవు ప్రతిస్పందించినపుడు, నీలో ఓ అద్భుతమైన ఆధ్యాత్మిక ఫలదీకరణ కలిగిస్తాడు. అప్పుడు విశ్వాసం పుడుతుంది. మనలో మనంతట మనమే దేవుని ఉనికిని అనుభవిస్తాము. అదే దేవుని సన్నిధి వరము. ఆ సన్నిధే మనల్ని మారుస్తుంది. ప్రేమ పూర్వకంగా ఆ అజమాయిషీకి లోనవుతాము. అంతకు మునుపున్న నిర్ణయాలకు ఇప్పటికీ చాలా మార్పు కనిపిస్తుంది. నిన్ను చూచిన వారు సహితం ఆ మార్పును గమనించ గలుగుతారు. మన గత నిర్ణయాలు, "అది చేయి, ఇది చేయకు" అనే నియమాలు ఇక పనిచేయవు. చాలా మంది మరలా మరో "మిని ధర్మశాస్త్రాన్ని" తయారు చేస్తున్నారు. జాగ్రత్త!!

## నూతన స్వేచ్ఛ : దేవుని కృపావరము

నేనో యువకునిగా ఉన్నపుడు విశ్వాసాన్ని గురించిన అవగాహన సరైన విధంగా ఉండేది కాదు. అది ఒక మతం కాదని, ఒక సంబంధ బాంధవ్యమని నాకు ఇప్పుడు తెలుసు. క్రైస్తవులు - యేసు బోధలను కాక, యేసునే అనుసరిస్తున్నామని ఎందుకనుకొంటున్నారో తెలిసికోవాలంటే యేసును గూర్చే ముందు ఆలోచించాలి. కారణం సామాన్యమైనదే, యేసు సజీవుడు. మహమ్మద్‌కు, గాంధీకి శిష్యులున్నారు; అయితే వాళ్లు తమ నాయకులు విడచి వెళ్లిన బోధనల ప్రకారం జీవించ ప్రయత్నిస్తారు. మహమ్మద్, గాంధీ మరణించారు. వారి అనుచరులు వారితో వ్యక్తిగత సంబంధాలు నెరప లేరు. క్రైస్తవ విశ్వాసం - సజీవుడై యున్న యేసుతో వ్యక్తిగత సంబంధం; ఆయన్ను ముఖాముఖిగా చూస్తామనే పూర్ణ నిరీక్షణ.

చాలా మంది విశ్వాసాన్ని ఎలా పొందగలం? దాన్ని ఎలా నిలుపుకోగలం? అని తర్జన భర్జన పడిపోతుంటారు. ముందుగా మనం చెప్పుకున్న విషయాలు ఈ అపార్థాన్నుండి మనల్ని బయటపడేలా చేస్తాయి. విశ్వాసమంటే కొందరు ఇలా

అనుకుంటారు. మొదట యేసును దృఢంగా అంగీకరించటానికి తమ చిత్తాన్ని వాడటమని, ఆయన బోధనలకనుగుణంగా జీవించేందుకు కాస్తంత క్రమశిక్షణ పాటించమని అనుకుంటున్నామని, కొందరు అనుకోవచ్చు. యేసు చెప్పే విషయాలను తీవ్రంగా పరిగణించని వారు అలాగే అనుకుంటారు. యేసుజీవిత శైలి, ఆయన బోధనలు క్రూరమైనవేమీ కాదు. "మీ శత్రువును ప్రేమించండి" " ఓ స్త్రీని మోహపు చూపుతో చూస్తే తన హృదయంలో వ్యభిచరించినట్టే" అంటే అస్సలు ఆ తలంపు రావటమే పాపమని అర్ధం. క్రియ జరిగినప్పుడు కాదు. "ఒకరిని ఒకరు క్షమించుకోండి" "డెబ్బది ఏళ్ల మారుల మట్టుకు" ".....పరిపూర్ణులై యుంటారు...."!

కొన్ని వారాలు, లేక, నెలల వరకు పిడికిలి బిగించి పళ్లు కొరుకుతూ వుండే వ్యక్తి ఇహ ఆ ప్రమాణాలకే బద్ధుడై పోతాడు. బ్రిటిష్ గణిత శాస్త్ర వేత్త. తాత్వికుడైన బెర్ట్రండ్ రస్సల్ అన్నాడు." నీ శత్రువులను ప్రేమించు – అనే సూక్తి చాల మంచిదే కాని.... మనలో చాలమందికి అది కష్టతరం....'' యేసులా జీవించ యత్నించడం కష్టతరమే కాదు – అసాధ్యం." మన సొంత అనుచిత నైతిక అనుభవం మనల్ని కుదిపి వేసేంత వరకు – మన జీవితాలకు అవసరమైన దైవ కృపావరమును అర్ధం చేసికోలేము. మన పరిస్థితిని గూర్చి యేసు సమీక్షించిన తీరును కూడ ఎదిరిస్తాము.

**"మనుష్యుని లోపలి నుండి బయలు వెళ్లేది మనుష్యుని అపవిత్రపరస్తుంది. లోపలి నుండి అంటే మనిషి హృదయములో నుండి దురాలోచనలు, జారత్వాలు, దొంగతనాలు, నరహత్యలు, వ్యభిచారాలు, లోభాలు, చెడుతనాలు, కృత్రిమాలు, కామవికారం, మత్సరం, దేవదూషణ, అహంభావం, అవివేకం వస్తాయి. ఈ చెడ్డవన్నీ లోపలినుండి అంటే మనిషి హృదయంలోనుండి వచ్చి మనిషిని అపవిత్ర పరుస్తాయి. మార్కు 7. 20–23.**

ఈ వాక్యభాగాలను చదుకుతుండగానే, మన హృదయాంతరంగంలో, మనస్సుల్లో – అయన చెప్పింది వాస్తవమేనని మనందరం ఎరుగుదుము. బ్రిటిష్ రచయిత జి.కె. ఛెస్టర్టన్ అన్నట్టు – క్రైస్తవ సిద్ధాంతాల్లో – ప్రయోగాత్మకంగా యధార్థమని నమ్మదగిన ఒకటేంటంటే – మానవుని పతనం. కొందరు దాన్ని ఒప్పుకోక పోవచ్చు. అయితే – మనం నిజంగా మంచివాళ్లముగ ప్రయత్నించడమే. మనకు కృప అవసరమై ఉందని చాటుతుంది. కృప అనగా – అర్హత లేకపోయినా అందే సహాయం. అపోస్తలుడైన పౌలు ఇలా వివరించాడు. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియవలన కలిగింది కాదు గనుక ఎవ్వడూ అతిశయించకూడదు'' దైవాశీస్సులు

# క్లుప్త ప్రసంగాలు

**యెహోవా పండుగలు**

1. పస్కా పండుగ. వ.5
2. పొంగని రొట్టెల పండుగ. వ. 6
3. ప్రధమ ఫలముల పండుగ. వ 13
4. పెంతెకోస్తు పండుగ. వ 16
5. బూరల పండుగ. వ.24
6. ప్రాయశ్చిత్త పండుగ. వ.27
7. గుడారాల (పర్ణశాలల) పండుగ. వ. 34.

**ఎందుకు?**

**1. మీ జనులు ఎరుగునట్లు వ. 42.**
నిర్గమ. 12. 25-27
పిల్లలకు తెలియజేయాలి.
ద్వితి 4.9 -
మరువక యుండునట్లు జాగ్రత్త పడాలి.
ద్వితి 8.14 - యెహోవాను మరచెదవేమో
**2. పశ్చాత్తాపపడుటకు, దుఃఖించుటకువ.27**
ప్రక 2.5 ఏ స్థితిలోనుండి పడితివో జ్ఞాపకముచేసుకుని మారుమనస్సు పొందాలి.
**3. సంతోషించుటకు**
ద్వితి 16.14 - 17 అందరూ, 26. 10, 11 - నీకు, నీ ఇంటివారు
నెహెమ్యా 8.10
యెహోవాయందలి ఆనందము బలము
**వీటి అర్ధము**
ఈ పండుగలన్నీ మన ప్రభువునే సూచిస్తున్నాయి. అంతేగాక విశ్వాసి జీవితంలోని అనుభవాలను తెలుపుతాయి.

**1. పస్కా** - మనకోసం క్రీస్తు మరణం. వ.5. - 1 కొరింథి 5.7
ఇది వారికి జ్ఞాపకం చేయబడింది.
అ) వారి స్థితి. నిర్గ. 1. 11-23
పాప బానిసత్వము
ఆ) దేవుని జాగ్రత్త. నిర్గ 2.24, 2. 7, 8
ఇ) దేవుడు రక్షించిన విధానము.

1. గొర్రెపిల్ల వధింపబడింది.
   నిర్గ 12.6 - 1 కొరి 5.7, 1 తిమొ 2. 5,6
2. రక్తపుగుర్తు.నిర్గ12.22,రోమా3.25
3. వాగ్దానము. నిర్గ 12. 13
   దాటిపోయెదను. - 1 యోహా5. 9-13
   యోహాను 5.24 రోమా 8.1

**2) పులియని రొట్టెల పండుగ** - క్రీస్తు స్వచ్ఛమయిన జీవితము, వేరు చేయబడిన జీవితానికి సూచన. పులిసిన పిండి పాపానికి సూచన. దేవుని బిడ్డలు సమస్త పాపాల నుండి వేరుచేయబడిన జీవితాలు ఉండాలి. సంఖ్యా 23.9 ఆ జనము వంటిగా నివసించును, జనములలోలెక్కించబడరు. 1 కొరింథి 5. 6-8

**3) ప్రధమ ఫలముల పండుగ** - క్రీస్తు పునరుత్థానము1 కొరింథి 15.23 ప్రధమ ఫలము క్రీస్తు - దేవుని మంచితనాన్ని జ్ఞాపకం చేస్తుంది.మత్తయి 5. 45 సూర్యుని ఉదయింప జేస్తున్నాడు, వర్షాన్ని కురిపి స్తున్నాడు.రోమా 2.4 దేవుని అనుగ్రహము, మంచితనము నిన్ను మారుమనస్సుకు నడిపించాలి.

**4) పెంతెకోస్తు పండుగ** - 15-23 - పరిశుద్ధాత్మ దిగిరావటము. అపో 2.1-4 యోహాను 15.26 ఆదరణకర్త, సత్య స్వరూపియైన ఆత్మ 6.7- నేను వెళ్లిన యెడల ఆదరణకర్త

**5) బూరల పండుగ** - 15.23 - క్రీస్తు రెండవ రాకడ 1 థెస్స 4.13-18
1 కొరింథి 15. 51-58

**6) ప్రాయశ్చిత్త పండుగ** - క్రీస్తు మెస్సియ్యాగా ఇశ్రాయేలుకు కనపరచు కొనుట జకర్యా 12.10 ప్రకటన 1.7 ఇశ్రాయేలు పాపముల కొరకైన ప్రాయశ్చిత్తము.

**7) పర్ణశాలల పండుగ** - ఈ భూమిమీద క్రీస్తు స్థాపించ బోయే శాంతి (విశ్రాంతి) రాజ్యమునకు సూచన . యెషయా 11. 6-10

# 75వ పుట్టినరోజు శుభాకాంక్షలు



ఆచార్య ఆరార్కే, డా|| దేవ గార్లతో
శ్రీ ప్రసాదరావు దంపతులు



ప్రసాదరావు దంపతుల కోసం ప్రార్థించి
ఆశీర్వదిస్తోన్న ఆచార్య ఆరార్కే



ఆరార్కే గారితో
శామ్ దంపతులు

ఆగష్టు 20 న ప్రియసోదరులు **పిల్లి దైవ ప్రసాదరావు గారి** 75వ పుట్టిన రోజు సందర్భంగా దేవునికి స్తుతులు సమర్పిస్తూ తమ స్వగ్రామం ఎడ్లపాడులో కృతజ్ఞతా సభను ఏర్పాటు చేశారు. ఆచార్య ఆరార్కే గారు, డా|| దేవ గారు వారిని దర్శించారు. ఆచార్య ఆరార్కే గారు దంపతుల కోసం ప్రార్థించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారి కుమారుడు బ్రదర్ శామ్ గారు కుటుంబ సమేతంగా అమెరికా నుండి ఇండియాకు వచ్చారు. సోదరులు ప్రసాదరావు గారు వారి శ్రీమతి దేవదయమ్మ గారు ఇద్దరూ రిటైర్డ్ టీచర్లు. దేవుడు వీరిని ఆశీర్వదించి ఐదుగురు కుమారులను ఇద్దరు కుమార్తెలను ప్రసాదించారు. ఇద్దరు కుమారులు అమెరికాలో నివసిస్తున్నారు.

ప్రభువు చిత్తమైతే ఆచార్య ఆరార్కే మూర్తి గారు, ఇవా|| డా. దేవసహాయం గారు అక్టోబరు నెలలో అమెరికాలో తెలుగు ప్రజల మధ్యన సేవ నిమిత్తమై వెళ్లాలి. అందుకు గాను ప్రసాదరావు గారి కుమారులు జాషువా గారు ఆహ్వానాలు పంపారు. పాఠకులు ఈ దంపతుల కోసం, కుటుంబ సభ్యులందరికోసం ప్రార్థించాలని కోరుతున్నారు.

# వివాహవేదిక

## వరుని కోసం...

1) విజయవాడలోని ఓ కార్పోరేట్ కాలెజిలో కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్‌గా జాబ్ చేస్తోన్న యల్.ఇ.యఫ్ సంఘానికి చెందిన 30 సం॥ వధువుకు డిగ్రీ గాని, పి.జి గాని చేసి, 35 సం॥రాల లోపు వయస్సు కలిగి, 5'.4" ఎత్తు గల, విశ్వాసియైన వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నంబరు – **9866464575 (SVV-M-198)**

2) కర్నాటక, హుబ్లి లో ఓ ప్రవేటు కంపెనీలో జాబ్ చేస్తూ సుమారు నెలకు రు.6వేలు జీతం, 30 సం. వయసు కలిగిన బ్రదరన్ సంఘానికి చెందిన వధువుకు డిగ్రీ చేసి మంచి ఉద్యోగం కలిగి క్రిస్టియన్ మాలకు చెందిన విశ్వాసియైన వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన రెఫరెన్స్ నంబరు – **SVV-M-199**

3) 25 సం వయసు కలిగి 5 సం॥రాల డిప్లోమా ఇన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ చేసి, అన్ని విధాల మంచి కుటుంబానికి చెందిన వధువుకు – 25 నుండి 30 సం॥రాల కలిగి పోస్టు గ్రాడ్యుయేట్ అయివుండి మంచి ఉద్యోగం గలిగిన విశ్వాసి అయిన వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన రెఫరెన్స్ నంబరు – **SVV-M-200**

4) 24 సం॥ వయస్సు కలిగి B.A., B.Ed., చదివి 4'11" ఎత్తు తూ॥గో॥ జిల్లాలో పిఠాపురంలో ఉన్న క్రిష్టియన్ వధువుకు. 30సం॥లోపు ఉద్యోగస్తుడు, మంచి కుటుంబం కలిగిన వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ – **9704800047 (SVV-M-201)**

5) కొయంబత్తూర్‌లో ప్రాజెక్టు ఇంజనీర్‌గా పనిచేస్తూ నెలకు రూ. 15వేలు జీతం, 28 సం॥ వయస్సు 5'5" ఎత్తు కలిగి విశాఖపట్నంలో ఉన్న బాప్టిస్టు సంఘమునకు చెందిన వధువుకు బాప్టిస్టు సంఘమునకు చెందిన 32 సం॥లోపు వయసు కలిగి 5'5" ఎత్తు వున్న డాక్టర్ లేదా ఇంజనీరింగ్ వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ – 0891-6536167 **(SVV-M-202)**

6) సొంత క్లినిక్ (ఫిజియో థెరిపిస్ట్) నడిపిస్తున్న 29 సం॥లు వయస్సు 5' అడుగుల ఎత్తు కలిగి విశాఖపట్నంలో నివసిస్తున్న బాప్టిస్టు సంఘమునకు చెందిన వధువుకు బాప్టిస్టు సంఘానికి చెందిన 32 సం॥లోపు వయసు కలిగి 5'5" ఎత్తు వున్న డాక్టర్ లేదా ఇంజనీరింగ్ వరుడు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నంబరు – 0891- 6536167 **(SVV-M-203)**

## వధువు కోసం...

1) ఐ.బి.యం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా నెలకు 35 వేల జీతము, స్వంత ఇల్లు మీద అద్దె మొ॥ రాబడి కలిగిన వరునకు తగిన చదువు ఉద్యోగం కలిగిన క్రిస్టియన్ మాల వధువు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన రెఫరెన్స్ నంబరు – **SVV-F-578**

2) స్పోకెన్ ఇంగ్లీషు సెంటర్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న 36 సం॥ వయసు కలిగి 5'6" ఎత్తుగల వరునికి – 32 సం॥ లోపు, తగిన వధువు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నెంబరు – 9866464575 **(SVV-F-579)**

3) చిన్న పిల్లల పరిచర్యలో, సేవలో ఉన్న 32 సం॥ వరునికి చిన్న పిల్లల పరిచర్య యెడల ప్రేమ, భారము కలిగి సేవ చేయటానికి ఇష్టపడే వధువు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన రెఫరెన్స్ నంబరు - SVV-F-580

4) చెన్నైలోని CST Ramboll Consulting Eng. lit. లో పనిచేస్తూ సంవత్సరానికి 4.5 లక్షలు జీతము, 5'8" ఎత్తు, తెలుపు రంగులో వున్న 31 సం॥ల వరునికి మంచి రంగు, 5'6" - 5'8" ఎత్తు, 24-28 మధ్య వయస్సు B.Tech చదివి మంచి విశ్వాసియైన వధువు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నంబరు - 0866 - 6620321 (SVV-F-581)

5) బెంగుళూరులోని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తు సం॥ 9.6 లక్షలు జీతం, 5'10" ఎత్తు, 30 సం॥ వయస్సు, గలిగిన వరునికి 24-28 మధ్య వయస్సు 5'1" - 5'2" ఎత్తు మంచి చదువు కలిగిన వధువు కావలెను. వివరాలకు సంప్రదించవలసిన నంబరు - 0891 - 2526582 (SVV-F-582)

**విశ్వాసులు కుటుంబాలలోని యువతీయువకులకు స్పందన వివాహవేదిక ఎంతగానో సహకరిస్తుంది. విశ్వాసులయిన తల్లిదండ్రులు, వధువు, వరుడు వివాహవేదికలో సభ్యులుగా చేరండాలు. మీకు అప్లికేషన్ పంపిస్తాము. దానిలో వివరాలన్నీ మాకు పంపటం వలన సరైన సంబంధాలు మీకు తెలియజేయుటమే గాక ఈ యువతీయువకులందరికోసం ప్రత్యేక ప్రార్ధనలు చేస్తాము. వివరాలకు ఈ రోజే సంప్రదించండాలు.**

# ఈ మాసపు పాట

**రచన - ఆచార్య ఆరార్కే**

యేసు కోసం నా జీవితం
ఆకలి గొంటున్నది
జీవజల పానం కోసం
దప్పి గొంటున్నది

యేసే నా ఆహారం
పరిశుద్ధాత్మే నా పానీయం

డబ్బుకాదు
ఆస్తిపాస్తులు కాదు
యేసే నా ప్రియ యజమాని
డబ్బు జమా ఖర్చు లెక్క
యేసుకే అప్పగిస్తాను

యేసే నా ధనం
పరిశుద్ధాత్మే నా దాన గుణం

## పరిశుద్ధ వివాహము

దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారిని సేవలో ఎంతగానో ప్రేమించే ప్రియులు (స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టరు, సెక్రటరి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్, హైదరాబాద్) శ్రీ వై. సత్యానందం దంపతుల జ్యేష్ఠ కుమారుడు రత్నాకర్ - శాంతిల పరిశుద్ధ వివాహం ఆగష్టు మాసం 20వ తేదిన హైదరాబాద్‌లోని నారాయణగూడ బాప్టిస్ట్ చర్చిలో ఎంతో ఘనంగా, కన్నుల పండుగగా దేవుని మహిమార్థమై జరిగింది.

ఈ పవిత్ర పరిణయానికి స్థానిక సంఘకాపరి రెవ. డా॥ జి. సామ్యేలు గారు అధ్యక్షత వహించి వివాహాన్ని జరిపించగా ఆచార్య ఆరార్కే మూర్తి గారు వివాహ సందేశాన్ని అందించారు. వధూవరుల ఇరుకుటుంబాల బంధువులు అనేకమంది హిందువులు, క్రైస్తవ వివాహానికి హాజరు కావటం చాలా మందికి ఇదే మొదటిసారి. క్రైస్తవేతర స్నేహితులు సహితం వివాహం జరిగిన విధానానికి ప్రత్యేకించి వాక్య సందేశానికి చాలా ఆకర్షితులయినట్లు ప్రియులు సత్యానందం గారు సాక్ష్యమిచ్చారు.

ఈ మధ్యనే నూతన వధూవరులను ఆచార్య ఆరార్కే దంపతులు, స్పందన సంపాదకులు డా॥ దేవ గారు, దర్శించి, ప్రార్థించారు.

ప్రియులు సత్యానందంగారి తల్లి వయోవృద్ధ సోదరి. దేవుని వాక్యాన్ని ఎంతగానో ప్రేమించే వ్యక్తి. ఆరోగ్య కారణాలను బట్టి గొంతులోని స్వరపేటికను సర్జరీలో తొలగించటం వలన మాటలు రావు గాని దేవుని వాక్యాన్ని రేడియోలో, టివిలో ఆలకించి ఎంతగానో ఆశీర్వదించబడిన ఆమె సాక్ష్యం పులకింపజేసింది.

నూతన వధూవరులు రత్నాకర్, శాంతి దంపతుల కోసం, సత్యానందం దంపతుల కోసం తల్లి గారు, అత్తగారి కోసం, సత్యానందంగారి మిగతా కుటుంబ సభ్యులకోసం పాఠకులు ప్రార్థించాలని మనవి. ప్రియులు సత్యానందం గారు ప్రభుత్వపరంగా ఉన్నత శ్రేణి ఉద్యోగంలో ఉంటూ దేవుని నామాన్ని మహిమ పరుస్తున్నారు. దేవునికి స్తోత్రాలు.

### సెప్టెంబరు గ. ను. క ఆల్ కరెక్టు రాసిన వారి పేర్లు

కె. భారతి దేవప్రియం – కడప, హెచ్. సరళమ్మ, పి.యస్. భాగ్యవతమ్మ – గిద్దలూరు, వై. ఎస్తేరమ్మ, వై. మాణిక్యం – కంచికచర్ల, భారతి ఆండ్రూస్ – చింతగుంట, కెంపురత్నకుమారి, కె. కనకమ్మ – హన్మకొండ, మణిజయప్రకాష్ – అమ్మిరెడ్డిగూడెం, కె. సుధారాణి – అమ్మపాలెం, జి. శిరిషాషారోను – నెల్లూరు, డి.డి.ఎ. మణి – విశాఖపట్నం, ఎ. లలితమ్మ, ఆర్. యం. విజయకుమారి – మదనపల్లి, ఎ.యస్. ప్రభావతి – గుంతకల్, యం. రాజమ్మ, బి. శాంతకుమారి – కడప, ప్రభులత – ఆదిలాబాద్, కె. సమూయేలు – తాడేపల్లిగూడెం, జి.కె.యల్. సుగుణమ్మ, జి. ఎస్. సునీతరావు – బద్వేల్, ఫెయిత్ రాజామణి – మైలవరం, వి. రోదే – వరంగల్, జయమ్మలాబాను – గుంతకల్, గ్రేస్ విలియమ్స్ – ఆనంద్‌బాగ్, డి. రాజమ్మ – బైరెడ్డిపాలెం, వి. లక్ష్మినరసమ్మ – విస్సన్నపేట, బి. మాదవిఅశోక్ – పర్చాల, బి. కృపానందం – నర్సాపూర్, ఆర్. రాజ్యలక్ష్మి – మంతెన, పి. దేవదానం – నంద్యాల, టి. సువర్ణరాజరత్నం – కడప, యస్.యఫ్. కస్తూరిబాయి – మదనపల్లి, జి.రిబ్కమ్మ – కలసపాడు, పి.జయమణి – విజయనగరము, బి.యన్. హేమలత – మదనపల్లి, టి.దీనాక్రిష్టోఫర్ – నక్కలగుట్ట, యమ్. ఝాన్సిశాంతకుమార్ – హనుమకొండ, కె.వంశీ – పేరాల, యస్. దేవమణి – ఎమ్మిగనూరు, కె.ప్రేమరూతు – గుంటూరు, యం.సి.మనోహరమ్మ – అనంతపూర్.



వేదికనలంకరించిన దైవజనులు



ఆచార్య ఆరార్య గారిని సందేశానికి
ఆహ్వానిస్తున్న రెవ.డా.జె.సామ్యేల్ గారు



పెళ్ళి కుమారుడు - రత్నాకర్
పెళ్ళి కుమార్తె - శాంతి




వివాహాన్ని జరిగిస్తున్న దైవజనులు
రెవ.డా.జె.సామ్యేల్ గారు
దైవజనులు పి.జోష్వ గారు




నూతన దంపతులను అభినందిస్తున్న ఆరార్య



వివాహ సందేశమిస్తున్న ఆచార్య ఆరార్య



పాస్టర్ డేవిడ్, శ్రీ సత్యానందం, రాజీవ్, ఆచార్య ఆచార్య



ఆచార్య దంపతులతో రత్నాకర్ దంపతులు
(నవ దంపతులు)



ఆచార్య దంపతులతో శ్రీ సత్యానందం గారి
తల్లి, అత్త గారు



ఆచార్య గారికి ప్రత్యేక షాలువ
బహూకరిస్తోన్న శ్రీ సత్యానందం తల్లి గారు



ఆచార్య గారి దంపతులతో శ్రీ సత్యానందం దంపతులు



# బైబిల్‌లోని పేర్లు వాటి అర్థాలు

**అదాదా** = నిత్యాలంకారమైనది; లేక పండుగ. యూదా గోత్రపు దక్షిణప్రాంతంలో ఒక పట్టణము - యెహో 15:20-32

**అదామా** = నేల; లేక కోట. నఫ్తాలి గోత్ర స్వాస్థ్యమందలి ఒక పట్టణము - యెహో 19:35-38

**అదామి** = నరుడు; లేక బలపరచబడిన స్థలము. నఫ్తాలి గోత్రస్వాస్థ్యమందలి ఒక పట్టణము - యెహో 19:33

**అదాయా** = యెహోవా అలంకరించెను; లేక యెహోవాచేత నలంకరింపబడినవాడు.

(1) యూదా రాజైన యోషీయా తల్లి యొక్క తండ్రి - 2 రాజు 22:1 (2) గెర్షోను వంశస్థుడైన ఒక లేవీయుడు - 1 గెర్షోను వంశస్థుడైన ఒక లేవీయుడు - 1 దిన 6:41, 42 (3) బెన్యామీను వంశస్థులలో ఒకడు - 1 దిన 8:21 (4) అహరోను వంశస్థులలో ఒక లేవీయుడు - 1 దిన 9:12; నెహె 11:12 (5) యూదా రాజైన యోహాను అధిపతులలో నోకని తండ్రి - 2 దిన 23:1 (6) ఎజ్రాకాలమంది బానీ వంశస్థులలో నొకడు - ఎజ్రా 10:29 (7) బానీ వంశస్థులలో మరియొకడు - ఎజ్రా 10:38 (8) యూదా వంశస్థులలో నొకడు - నెహె 11:5

**అదారు** = మహిమ గలది; లేక తేజోమయ మైనది. మార్చి ఏప్రిల్ మాసములలోపడు యూదుల పన్నెండవ నెల - ఎజ్రా 6:15; ఎస్తే 3:7, 13; 8:11; 9:1, 15, 16, 19, 21

**అద్దారు** = ఘనత; లేక అధిక మహిమ. ఎదోము దేశపు సరిహద్దునకు సమీప మందు యూదా గోత్రస్వాస్థ్యములోని ఒక పట్టణము - యెహో 15:3

**అద్దారు** = విశాలమైనది; లేక ఘనమైనది. బెన్యామీను మనుమడు - 1 దిన 8:3

**అద్నా** = సుఖానుభవము; లేక సంతోషము. (1) రాజైన దావీదు సైన్యమందు అధిపతియై యుండిన ఒక మనష్షే గోత్రికుడు - 1 దిన 12:20 (2) రాజైన యెహోషాపాతు సైన్యాధిపతులలో ఒక ప్రధానుడు - 2దిన 17:14 (3) ఎజ్రాకాలమున అన్యస్త్రీని పెండ్లిచేసికొనిన ఒక ఇశ్రాయేలీయుడు - ఎజ్రా 10:30 (4) యెహోయాకీము

ఏలుబడిలోని ఒక యాజకుడు - నెహె 12:15

**అద్మా** = ఎఱ్ఱనిది. సొదొమయును పట్టణముతో కూడ న శించిన ఒక గ్రామము - అది 10:19; 14:2,8; ద్వితీ 29:23; హోషే 11:8

**అద్మాతా** = పారసీకుల యొక్క మాదీయుల యొక్క ఏడుగురు ప్రధానులలో నొకడు - ఎస్తే 1:15

**అద్ది** = ప్రభువైన యేసు వంశావళియందున్న వారిలో ఒకడు - లూకా 3:28

**అద్రియ** = కఱ్ఱలేనిది. ఇటలీ దేశమున తూర్పు దిక్కునందలి సముద్రము - అ.కా. 27:27

**అదీతాయిము** = విస్తారమైన దోపుడు గల గ్రామము; లేక రెట్టింపలంకారము. యూదయ లోయలోని ఒక పట్టణము - యెహో 15:36

**అదీనా** = మృదువైనది; లేక భూషణము. రాజైన దావీదు సైన్యాధిపతులలోని ఒక రూబేను గోత్రికుడు - 1దిన 11:42

**అదీయేలు** = దేవుని అలంకారము; లేక దేవుని భూషణము (1) షిమ్యోను వంశస్థులలో నొకడు - 1 దిన 4:36 (2) యెరూషలేము నివాసియై యుండిన అహరోను వంశస్థులలో నొకడు - 1 దిన 9:12 (3) రాజైన దావీదు బొక్కసము మీద నియమింపబడినవారిలో ఒకని తండ్రి - 1 దిన 27:25

**అద్రేయేలు** = దేవుని మంద; లేక దేవుని

# మూర్తి గారి మాట

అతిశయోక్తి కాదు అనుభవసాక్ష్యము
చెప్పుకొనుట ఏమి తప్పుకాదు
విశ్వసించినది రహస్యము కాబోదు
మూర్తిగారి మాట ము క్తి బాట

అభినవ ప్రవక్తలది ఏమి చోద్యమో
అభినయ ప్రతాపులైరి నేడు
వంధ్య కాన్పు నొప్పి పగిది వంచన ఇది
మూర్తి గారి మాట ముక్తి బాట

అద్భుతములు జరుగునంచు
ఆశింతువా
కారణంబు చెప్పి కోరుకొనుము
మారు మనసు లేని మనుషుల తరమిది
మూర్తి గారి మాట ముక్తి బాట

అంతరిక్ష యాత్ర నాశించు వారికి
యేసునందు కోర్కె ఇట్టె తీరు
ప్రభువు వచ్చి నిన్ను పైకెత్తుకొని పోవు
మూర్తి గారి మాట ముక్తి బాట

# మంచి తెలుగు నేర్చుకోండి | గ్రీకు నేర్చుకోండి

ఆరార్కే

***ఎలా వచ్చాయో తెలియదు కాని ఈ రోజున క్రైస్తవ సంఘాలలో విచిత్రమైన భాష ఒకటి అలవడింది. ఈ రోజున టి.వి ల్లో వినే అనేక మాటలకు, పాటలకు క్రైస్తవేతరులు నవ్విపోతున్నారు అంటే నమ్మండి. కొన్ని మాటలు మనకు బాగా అలవాటై పోయినవి. ఎన్నిసార్లు చెప్పినా చాలా మంది సరిచేసుకోరు. సరే! అలాంటి వారిని మనం మార్చలేము గాని మార్పును స్వాగతించే మా పాఠకులకు ఈ శీర్షిక ఎంతో ఆశీర్వాద కారణంగా ఉంటుందనటంలో సందేహం లేదు.***

1. చాలా సంఘాలలో ఆత్మీయ జీవితం, ఆత్మీయ వ్యక్తులు, ఆత్మీయుడు అనే పదాలు వాడుతుంటారు. వాస్తవానికి ఆధ్యాత్మిక జీవితం అని వాడాలి. ఈ రెండు పదాల అర్థాలు తెలుసుకుందాం.
   **ఆత్మీయ** అంటే సన్నిహితమైన లేక ప్రేమ పాత్రులైన అని అర్థం. **ఆధ్యాత్మిక** అంటే ఆత్మసంబంధమైన అని అర్థం. ఈ రెండు మాటలను కలగాపులగం చేయకండి.
2. **యేసు** అని రాయాలి కాని **ఏసు** అని రాయకూడదు.
3. **వాగ్దానము** అని రాయాలి గాని **వాగ్ధానము** అని ఒత్తు రాయకూడదు.
4. **ప్రసంగీకుడు** అనకండి. **ప్రసంగికుడు** అనండి.

**మత్తయి 2:13**

మనుష్యుడు రొట్టెవలన మాత్రం కాదు గాని దేవుని నోటినుండి వచ్చే ప్రతి మాటవలన జీవిస్తాడు. ఈ మాట గ్రీకు బాషలో **రేమా** అనగా చెప్పబడినది లేక పలుకబడినది. వాక్కు . నోరు తెరచి మాట్లాడింది రేమా. అయితే **లోగోస్** కు **రేమా** కు ఎంతో తేడా ఉంది. '**లోగోస్**' అంటే ఒక భావము యొక్క వ్యక్తీకరణ అనగా అది ఒక సందేశం. ఒక భావప్రకటన, సంబాషణ. **లోగోస్** సందేశమైతే దానిని దేవుడు పలికినప్పుడు **రేమా** అవుతుంది. మనకు బైబిలు ఉన్నది. ఈ బైబిలు మొత్తం **లోగోస్**. ఈ బైబిలు లోని ఒక వచనాన్ని తీసుకొని పలికితే, ఉచ్చరిస్తే, అది **రేమా** అవుతుంది.

ఎఫేసీ 6:17 దేవుని వాక్యమనే ఆత్మఖడ్గం. ఇక్కడ వాక్యము అంటే లేఖనము అని కాదు. లేఖనము లోని ఒక వచనాన్ని తీసుకొని అధికారపూర్వకంగా ఉచ్చరిస్తే అది **రేమా** అవుతుంది. అదే ఆత్మఖడ్గం. ఈ ఖడ్గాన్ని వాడటంలో విశ్వాసి జాగ్రత్త వహించాలి.

**వచ్చే మాసంలో మరికొన్ని మాటలు నేర్చుకుందాం**

## రెవ. డి. సంపత్‌కుమార్, పరిమళ జ్యోతి గార్ల స్వదేశాగమన శుభాకాంక్షలు



మా ఏకైక కుమార్తె మా అల్లుడు
గార్లు సెప్టెంబర్ నెలలో
సింగపూర్, మలేషియా,
ఫిలిప్పిన్స్, థాయ్‌లాండ్,
ఇండోనేషియా పరిసర
ప్రాంతాలలో పర్యటించి తిరిగి
ఇండియా విచ్చేసిన సందర్భంగా
వారికి మా హృదయపూర్వక
శుభాకాంక్షలు.



పాస్టర్ యమ్. **యోహాను** గారు
వారి కుటుంబసభ్యులు
గూడవల్లి, విజయవాడ
ఫోన్: 2862624, 9346444486

## లిటిల్ ఏంజల్స్ హోమ్ (అనాథ, పేద పిల్లల ఆశ్రమము)



శ్రేష్ఠమైన ఈ చిన్న పిల్లల పరిచర్యకోసం
మీ వ్యక్తిగత, కుటుంబ, సంఘ ప్రార్థనలు
కోరుతున్నాము. వీరి కోసం ప్రార్థించండి.
ఒక బిడ్డను మీరు పోషించగలిగితే వారికయ్యే
ఖర్చును ప్రతినెలా మీరు పంపవచ్చును.
దయచేసి ప్రార్థించండి. దేవుడు మిమ్ములను
ప్రేరేపిస్తే మీ సేవాకానుకలు పంపి సహకరించండి.

గమనిక :
చెక్కులు, డ్రాఫ్టులు పంపేవారు
**SPANDANA** పేరు మీద
పంపాలి. మీ డబ్బు అందగానే
మీకు ఉత్తరం రాస్తాము.



వివరాలకు :
డా॥ దేవ
లిటిల్ ఏంజల్స్ హోమ్
పోస్టుబాక్స్: 415, విజయవాడ - 520 002.
ఫోన్ : (0866) 2539 547, 2539 549

మహిళా స్పందన

# ప్రేమ స్వరూపియైన యేసు



ధర్మశాస్త్రయుగంలో హాని కలిగిన ఎడల నీవు ప్రాణమునకు ప్రాణమును, కంటికి కన్ను, పంటికి పన్ను, చేతికి చేయి, కాలికి కాలు, వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బ నియమింపవలెనని (నిర్గమ 21:23-25) ఇశ్రాయేలీయులకు ఆదేశించిన సూత్రం ఇది. అయితే ఈ కృపాయుగంలో యేసు ఉదాక్తమైన చట్టాన్నిచ్చినట్లు యేసు శిష్యుడైన మత్తయి (5:39-42) తెలియచేసెను. న్యాయ స్థానాల ద్వారా న్యాయము చేకూరకపోతే విశ్వాసులైనవారు పగసాధించక ఆవిషయాన్ని దేవునికి అప్పగించమని అపొస్తలుడైన పౌలు రోమా (12:19-21) సంఘానికి తెలియచేసెను.

యేసు శరీరధారిగా ఉన్నరోజుల్లో అనేక బోధలు ఉపమానాల ద్వారా ప్రజలను మేల్కొలిపి తన ప్రేమచేత నాశనమునుండి తప్పించెను.

నేను మీతో చెప్పినదేమనగా మీరు పరలోకమందున్న మీతండ్రికి కుమారులైకుండు నట్లు మీశత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్ధన చేయుడి. ఆయన చెడ్డవారి మీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపచేసి నీతిమంతుల మీదను అనీతిమంతుల మీదను వర్షమును కురింపించుచున్నాడు. మీరు మిమ్మును ప్రేమించిన వారినే ప్రేమించిన ఎడల మీకేమి ఫలము కలుగును. సుంకరులును ఆలాగు చేయుచున్నారు కదా మీ సోదరులకు మాత్రమే వందనము చేసిన ఎడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి ? అన్యజనులును ఆలాగు చేయుచున్నారు కదాని యేసు శిష్యుడైన మత్తయి (5:44-48) ద్వారా తెలియచేసెను.

మనం అనుసరించే దేవుడు జీవితంలో ఒక్కసారి కూడ కన్ను గూర్చి దేశమంతకూడ తలవని దుర్మార్గుల మీద, ప్రతిక్షణం ఆయన సున్నిత హృదయాన్ని బాధించే అనీతిమంతుల మీద లేకుండా సూర్యుని ఉదయింపచేస్తూ వర్షాన్ని కురిపించే మంచివాడని ఎప్పుడైనా ఆలోచించారా ? పాపం, దుర్మార్గంతో పండి పోయిన ఈ లోకంలో మంచి చేయడం కాదు తప్పు చేయకుండా ఉండడమే నీతిగా ఎంచ బడుతుంది. యేసుచెప్పిన నీతి అంత తేలికైనది కాదు లోకంలో అది ఎంతో ఉన్నతమైనది. క్రీస్తు తప్పు చేయకుండా ఉండమని మాత్రమే కాదు "పరలోకపు తండ్రిని మహిమ పరచు నట్లు లోకంలో మన వెలుగుని ప్రకాశింప చేయుమని" మత్తయి (5:16) ద్వారా తెలియచేసెను.

ఇక్కడ మనము తెల్సికోవల్సిందేమనగా దేవుని ఆధ్యాత్మిక రాజ్యానికి ఆయువు పట్టు

ప్రేమే. దానికి రాజు ప్రేమామయుడైన యేసే. అందులో నున్న వారంతా ఆ నియమాన్ని (యోహాను 13:34) పాటిస్తూ పరిపూర్ణ ప్రేమనే లక్ష్యం పెట్టుకోవాలి. కొండమీద ప్రసంగములోని ముఖ్యాంశం స్వార్ధాన్ని చంపుకొని, దేవుని విషయంలో జీవం కలిగి బ్రతుకుతూ దేవుని సంతోషపెట్టాలి. ఈ గొప్ప ఆధ్యాత్మిక ఆదేశాలను పాటించాలంటే అందుకు ప్రోత్సహించే మార్గం "ఒకడు నన్ను ప్రేమించిన ఎడల వాడు నా మాటలు గైకొనును. అప్పుడు నా తండ్రి అతనిని ప్రేమించును. అప్పుడు మేము వాని యొద్దకు వచ్చి నివాసము చేయమని యేసు శిష్యుడైన యోహాను (14:23) తెలియచేసెను. దేవుని రాజ్యంలోని వారతా దీన్ని పాటించాలి.

ప్రియులారా మన యేసయ్య ఏది బోధిస్తే అదే చేసి చూపించాడుని తెల్సామీకు ? 1) కొన్ని నిముషాల్లో ప్రధాన యాజకులకు అప్పగించనైయున్న పన్నెండుమంది శిష్యులలో ఒకడైన యూదాని "చెలికాడా" అని సంభోదించెను. (మత్తయి 26:50) 2) భూమికి ఆకాశానికి మధ్య సిలువలో వ్రేలాడుతూ ఆయన్ని కొట్టి దూషించి చేతుల్లో, కాళ్ళల్లో మేకులు గ్రుచ్చి పక్కలో బళ్ళెములతో పొడిచి తలపై ముండ్ల కిరీటం పెట్టి అపహసించిన వారిని క్షమించి తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని (లూకా 23:34) తండ్రిని బ్రతిమలాడెను. 3) ఆయన చెప్పిన ఉపమానాల్లో కూడ - పరలోక రాజ్యము ఒక యింటి యజమానిని పోలియున్నది. అతడు తన ద్రాక్షతోటలో పని చేయువారిని కూలికి పెట్టుకొనుటకు ప్రొద్దున బయలుదేరి దినమునకు ఒక దేనారము చొప్పున పనివారికి ఒడంబడి తన ద్రాక్షతోటలోకి వారిని పంపెను. తరువాత తొమ్మిది, పన్నెండు, మూడు అయిదు గంటలకు వెళ్ళి మీరెందుకు ఊరకనే నిలిచియున్నారని వారిని అడిగి తన ద్రాక్షతోటలోకి వారిని పంపెను. సాయంకాలమైనపుడు ఆ ద్రాక్షతోట యజమానుడు తన గృహ నిర్వహాకుని చూచి పనివారిని పిలిచి చివర వచ్చిన వారు గంట మాత్రమే పనిచేసినప్పటికి పగలంతా ఎండబాధ తట్టుకొని కష్టపడి పనిచేసిన మాతో సమానము చేసితివని ఆయింటి యజమాని మీద సణుగుకొనిరి. అందుకాయజమాని సణుగుకొన్న వారిలో ఒకనిని చూచి "స్నేహితుడా" నేను నీకు అన్యాయము చేయలేదా అన్నట్లు వ్రాయబడెను. ఇక్కడ ద్రాక్షతోట యజమాని మంచితనాన్ని అర్ధ చేసికొనక సణుగుకొన్న పనివానిని చూచి స్నేహితుడా నేను నీకు అన్యాయము చేయలేదా నీవు నా యొద్ద ఒక దేనారమునకు ఒడంబడ లేదా ? నీకిచ్చినట్లే కడపట వచ్చిన వీరికిచ్చుట నాకిష్టమైంది. నాసొంత సొమ్ముతో నాయిష్టమొచ్చినట్లు చేయుట న్యాయము కాదా ? నేను మంచి వాడనైనందున నీకు కడుపు మంటగా ఉన్నదా అనెను. (మత్తయి 20:1-15)

లోకానుసారమైన మంచికి, నీతిసూత్రాలకు, న్యాయశాస్త్రానికి దేవుని అపరిమితమైన మంచితనమంటే కడుపు మంటగానే ఉంటుంది. చాలాసార్లు మనకు న్యాయమనిపించేది, నీతి అనుకొనేది

దేవునివిని ఉన్నత ప్రమాణాలు బయటపడి నపుడు అవి ఎంత నీతి బాహ్యామైనవో అర్ధమౌతుంది. రోజంతా పని చేసి ఒక్క దేనారము పొందిన పనివారికి యజమాని మంచితనం అర్ధం కాలేదు సరికదా సణుగుకొనేట్టు చేసింది. అంటే దేవుని మంచితనానికి మానవునిలో ఉన్న బుద్ధికి ఎంత వ్యతిరేకమో గమనించారా ?

ఈ ద్రాక్షతోట దేవుని పనికిని, దాని యజమాని దేవునికిని సాదృశ్యముగా చూపబడెను. తన ద్రాక్షతోటలో పనిచేసేవారి కోసం దేవుడు ఎప్పుడూ వెతుకుతూనే ఉన్నాడు (మత్తయి 9:36-38, 21:28) దేవుని రాజ్యంలో చాల పని ఉన్నప్పటికి అనేకులు ఊరకనే నిల్చుని లేక లోకసంబంధమైన పనికి బంధీలై పోవుట ఎంతో విచారకరము. కొందరికి పనిచేయుటకిష్టమే కాని వారికా అవకాశము రాలేదు. దేవుని కోసం శ్రమించే కొందరిని ఆయన వారి జీవితాలు చాలా వరకు గడచిన తరువాత పిలుస్తాడు. అట్టివారు కొద్దికాలం మాత్రమే పనిచేసే అవకాశం ఉంటుంది. తన కోసం శ్రమించేవారికి దేవుడు అత్యధిక ఫలమిస్తానని (మత్తయి 5:11,12, 10:41,42) వాగ్దానము చేసాడు.

ఇక్కడ మనము గ్రహించవల్సిందేమంటే ఒక్కగంట పనిచేసినవారు రోజు కూలి అందుకొన్నారు. ఇది భూస్వామి దయను, ప్రేమను, తెలియచేస్తుంది. వారు రోజు కూలి తీసికొనుటకు తగినపని చేయలేదుగాని రోజంతా బ్రతుకు చెరువు కోసం కష్టపడి పనిచేసినవారికి కూలి ఎంత అవసరమో ఒక గంట పనిచేసిన వీరికి అంతే అవసరము. అంటే కొద్ది కాలమైన ఆయన చిత్త ప్రకారం నమ్మకంగా పనిచేసినవారికి ఆయన తగిన బహుమతి ఇస్తాడు. న్యాయంగా ఆలోచిస్తే ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి పనిచేసినా ఎక్కువ అడిగే హక్కు వారికి లేదు. ఎందుకంటే వారు ఒక్క దేనారానికి ఒప్పుకొన్నారు. ఆయనకిష్టమైతే నమ్మకంగా చేసినవారికి అది దీర్ఘకాలమైన కొద్దికాలమైనా బహుమానం మాత్రం సమానముగా ఉంటుందని తెలియుచున్నది.

***(మిగతా వచ్చేనెల)***

**<u>ఆగస్టు నెల గ. ను. క ఆల్ కరెక్టు రాసిన వారి పేర్లు</u>**

పి.యస్. భాగ్యవతమ్మ - గిద్దలూరు, హెచ్. సరళమ్మ - గిద్దలూరు, జె. ప్రసాద్‌రావు - గోకవరం, యన్. సత్యనారాయణ - వైజాగ్, బి.యన్. హేమలతమ్మ, హెచ్. ఫ్లారెన్సమ్మ - చెన్నదొర్నాల, యాదల నిరీక్షణకుమార్ - ఇనమనమెళ్ళూరు, బి. మేరీజయప్రకాష్ - కృష్ణాజిల్లా, వి.బి. లక్ష్మి - వైజాగ్, టి. శాంతరత్నం - ఏలూరు, జె. కోమలాదేవి - విజయవాడ, వై. మాణిక్యం - కంచికచర్ల, కె. శెశీల్య - కంచికచర్ల, వై. ఎస్తేరమ్మ - కంచికచర్ల, కె. విమల - కొత్తవలస, పి. ఆశీర్వాదమ్మ - విజయనగరం, డి.డి.డి.ఎ. మణి - వైజాగ్, కె. భారతిదేవప్రియం - కడప, టి. సునీత - ఆదిలాబాద్, కె. విమలా - హైదరాబాద్, పి. ప్రకాష్ రావు - గుంటూరు, మార్తా యేసుదాస్ - జమ్మలమడుగు, బి. రాజీనకుమారి - హైదరాబాద్, బి. కృపానందము - నర్సాపురం, ఆర్. జయమ్మ లాబాను - గుంతకల్లు, యన్. మార్తమ్మ - గుంతకల్లు.

రేడియో పాఠం

# నిర్గమ కాండము



ఆచార్య ఆరార్కే

(గతసంచిక తరువాత)

కానీ ఇప్పుడు వచ్చిన చీకటిని "రా" దేవత తొలగించ లేకపోయింది. ఆ దేవత అపజయం పాలయింది. అంధకారమనే ఈ తెగులు దేవుడు చేసిన అద్భుతం. ఫరో నాలుగోసారి రాజీకి వస్తున్నాడు. ఇదే చిట్టచివరి సారి. ఈసారి ఫరో పిల్లలను కూడ తీసుకొని వెళ్ళమంటున్నాడు. కానీ మీ పశువులను ఇక్కడనే ఉంచమంటు న్నాడు. అయితే దేవుడు మీరు, మీ కుటుం బాలు, మీకున్నదంతా తీసుకొని వెళ్ళమంటు న్నాడు. పిల్లలను అక్కడ విడిచి పెట్టకూడదు. ఈజిప్టు దేశంలో ఆ పిల్లలు చెడిపోతారు.

విశ్వాసులు తమ పిల్లలను వారి భవిష్యత్తును లోకానికి వదిలి వేయకూడదు. లోకంలో ఆధ్యాత్మిక విలువలు లేవు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబం, ఈ మూడు కలసి లోకం అవుతుంది. పిల్లలు లోక పద్ధతిలో పెరిగితే వారు ఇక అంకెకురారు. లోకంలో గొప్పవారని పేరు పొందుతారు. కానీ వారు దేవుని రాజ్యానికి దూరమైపోతారు.

సోదరీ సోదరులారా! లోకం, శరీరం, సైతాను, ఈ మూడు విశ్వాసులకు శత్రువులు. మరికొందరు క్రైస్తవులున్నారు. వీరు తమ ఆస్తిపాస్తుల్ని లోకానికే విడిచిపెడుతున్నారు. ఈజిప్టు అంటే లోకానికి సంకేతం. తాము క్రైస్తవులై ఉండి సంఘారాధనలో పాల్గొంటూ దేవుణ్ని ఆరాధిస్తూ, ఒక చెంప లోకంలో వ్యాపారం చేస్తుంటారు. తమ ఆస్తినంతా ఈజిప్టులో పెట్టుబడి పెడతారు. ఆదివారం దేవుణ్ని ఆరాధిస్తు వారంలో మిగిలిన రోజుల్ని ఈజిప్టులోని ధన దేవతను ఆరాధించటం ఆధ్యాత్మిక మోసం. లోక పద్ధతులు లోక మర్యాదలు మనం పాటించకూడదు. సోదరీ సోదరులారా! త్వరలో ఒక గొప్ప సంఘటన జరుగబోతోంది. దేవుని సంఘం ఎత్తబడుతోంది. ఈ లోకానికి దూరంగా పైకి మధ్యాకాశంలోకి మనం ఎత్తబడతాము. మరి ఈ లోకంలో వారు పెట్టిన పెట్టుబడి అంతా నాశనమై పోతుంది. అప్పుడు వారు గోడుగోడున ఏడుస్తారు. ఎట్టి పరిస్థితిలోను దేవుని బిడ్డలు ఫరోతో రాజీ పడకూడదు. **లోకమర్యాదను అనుసరించక మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరం పొందండి.** ఇది దేవుని హితోపదేశం. లోకంతో రాజీపడకూడదు. సోదరీ సోదరులారా! మన దేవుడు ఎంతైన నమ్మదగినవాడు. మన పిల్లలకు ఈజిప్టు సుఖభోగాలు మంచివికావు. పిల్లలను గానీ మన ఆస్తిపాస్తులను గానీ, లౌకిక ప్రయోజనం

కోసం వాదకూడదు. పిల్లల ప్రవర్తన తల్లిదండ్రులు వాక్యానికి అనుగుణంగా మారేటట్లు చూడాలి. పిల్లల సౌశీల్యం తల్లిదండ్రుల చేతిలో రూపు రేఖలు దిద్దుకుంటుంది. పిల్లలు తప్పిపోతే తల్లిదండ్రులు వారిని సరైన మార్గానికి తిరిగి రప్పించాలి. తప్పిపోవడం అంతా పోయే మనస్తత్వం సౌశీల్యాన్ని చెరుస్తుంది. శోధనలు వచ్చినప్పుడు బిడ్డలు ఎలా వాటిని ఎదుర్కొనాలో తల్లిదండ్రులే నేర్పాలి. తల్లిదండ్రులు తమ పిల్లల్ను వీరు దేవుని పిల్లలు అనే దృష్టితో పెంచాలి. పిల్లల్ను అన్యాయంగా శిక్షించకూడదు. పిల్లలు తప్పు చేస్తే ఆ తప్పును మనం ద్వేషించాలి. కానీ పిల్లల్ను ప్రేమించాలి. పిల్లలు ఈ సంగతి గ్రహించేటట్లు తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమశిక్షణగా పెంచాలి. । **యోహాను 3:18 వినండి. మాటతోను, నాలుకతోను కాక, క్రియతో, సత్యముతో ప్రేమించాలి.** మనం చెప్పేదాని కంటే చేసి చూపించేది పిల్లల మనస్సులపై చెరగని ముద్ర వేస్తుంది. యేసుక్రీస్తు సిలువ మీద చేసి మనకు చూపిన కార్యం ఎలాంటిదో గమనించండి. యేసు మనల్ను క్రియలో సత్యమందు ప్రేమించాడు. అలాగే పిల్లలు కూడ ఉత్తరోత్తరా ప్రయోజకులై వారి తల్లిదండ్రులు తమను ఏవిధంగా ప్రేమించారో, తాము చేసిన తప్పులను ఎలా మన్నించారో పిల్లలు గ్రహించాలి. వారు గ్రహించేటట్లు తల్లిదండ్రులు ప్రవర్తించాలి. **కీర్తన 139:1-16 వరకు వినండి. నన్ను నా దేవుడు బాగా ఎరుగును. నాకు తలంపు పుట్టక మునుపే దేవుడు నా మనస్సును గ్రహించినవాడు.**

**వెనుక, ముందు దేవుడు నన్ను ఆవరించి ఉన్నాడు. దేవుడు తన చేయి నా మీద ఉంచాడు. నా అంతరింద్రియాలను దేవుడే కలుగచేశాడు. దేవుని కార్యములు ఆశ్చర్యకరములు. నేను పిండమునై ఉండగా దేవుని కన్నులు నన్ను చూచాయి. దేవా నన్ను పరిశోధించి నా హృదయాన్ని తెలుసుకో, నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలుసుకో. నీకు ఆయాసకరమైన మార్గం నాయందు ఉన్నదేమో చూడు. నిత్య మార్గమున నన్ను నడిపించు.** ఇది విశ్వాసులు చేయవలసిన ప్రార్థన. సోదరీ సోదరులారా ! తల్లిదండ్రులారా ! మీ పిల్లల్ను మీరు ఎలా పెంచుతున్నారు ? ఫరో ఇశ్రాయేలు ప్రజను రాజీ మార్గమునకు నడిపించాలని ప్రయత్నం చేస్తున్నాడు.

నీ పిల్లల్ను ఇక్కడే ఉంచు. నీ ఆస్తిని ఇక్కడే ఉంచు. అని సలహా ఇస్తున్నాడు. అలా ఎన్నటికి చేయకూడదు. **లూకా సువార్త 11:11-13 మీలో తండ్రి అయిన వాడు చేపనడిగితే చేపకు ప్రతిగా పామును ఇస్తాడా ? గుడ్డును అడిగితే తేలును ఇస్తాడా ? కాబట్టి మీరు చెడ్డవారైయుండి మీ పిల్లలకు మంచి ఈవులను ఇయ్యఎరిగి ఉండగా పరలోక మందు ఉన్న మీ తండ్రి తన్ను అడుగు వారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయంగా అనుగ్రహిస్తాడు !** పరలోక తండ్రి తన బిడ్డలను ఎంతో ప్రేమిస్తాడు. ఆలాగే ఇహలోకంలో తండ్రులు తమ బిడ్డలను ప్రేమించి శ్రేష్ఠమైన ఈవులు ఇస్తారూ. తండ్రి మనకిచ్చిన ఈవులు రెండు. తన కుమారుడైన యేసుక్రీస్తును ఈవిగా ఇచ్చాడు. గనుక మనం రక్షించబడ్డాం. పరిశుద్ధాత్మనిచ్చాడు. గనుక మనకు శక్తి లభించింది. తండ్రులు తమ బిడ్డల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారి జీవితాలను తీర్చిదిద్దాలి.

కొరింథీ. 10:23, 24 అన్ని విషయములందు నాకు స్వాతంత్రము కలదు. గానీ అన్ని చేయతగినవి కావు. అన్నిటి యందు నాకు స్వాతంత్రం కలదు. గానీ అన్నీ క్షేమాభివృద్ధి కలుగచేయవు. ఎవడును తన కొరకే కాదు. ఎదుటి వాని కొరకు మేలు చేయటానికి ప్రయత్నించాలి. ఇది ఆధ్యాత్మిక నియమం. మనము భోజనం చేసినా పానం చేసినా ఏమి చేసినా దేవుని మహిమ కొరకే చేయాలి. యూదులకైనా గ్రీసు దేశస్తులకైనా, దేవుని సంఘమునకైనా అభ్యంతరం కలుగచేయ కూడదు. పౌలు అంటున్నాడు. నేను కూడ స్వప్రయోజనమును కోరక అనేకులు రక్షింపబడాలని వారి ప్రయోజనమును కోరుతూ అన్ని విషయాలలో అందరిని సంతోష పెడ్తున్నాను. నేను క్రీస్తుని పోలి నడుచుకొంటున్న ప్రకారం మీరుకూడ నన్ను పోలి నడుచుకోండి. కుటుంబంలో తల్లిదండ్రులు ఈ సత్యాన్ని పాటించాలి. మనం క్రీస్తుని పోలి నడుచుకునే స్థానంలోనే పిల్లలు తమ తల్లిదండ్రులను పోలి నడుచుకుంటాడు. సోదరీసోదరులారా మరొకసారి ఆలోచించండి. ఇశ్రాయేలు ప్రజలను వెళ్ళిపోనివ్వకుండ ఫరో ఎందుకు అంతపట్టు పట్టాడు ? ఇశ్రాయేలు ప్రజలు ఈజిప్టులో బానిసలు వెట్టి చాకిరి చేస్తున్నారు. వీరిచేత కఠినమైన పనులు చేయించి ఈజిప్ట రాజు గొప్ప గొప్ప పట్టణాలు నిర్మించాడు. ఆలాంటప్పుడు ఆ ప్రజలను ఎలా వదులుతాడు, ఫరో స్వార్థపరుడు. ఇశ్రాయేలు ప్రజలు చేత ఉచితంగా బండ చాకిరి చేయించుకొంటున్నాడు. వారికి ఇవ్వవలసిన కూలి సరిగా ఇవ్వటంలేదు. దేవుడు తన ప్రజల కడగండ్లను చూస్తూ ఉన్నాడు. ఎంతో బాధ పడుతున్నాడు. ఈ అధ్యాయంలో మొట్టమొదటిసారిగా 19వ వచనంలో ఎర్ర సముద్రం పేర్కొనబడింది. మిడతలన్ని ఎర్ర సముద్రంలో పడవేయబడ్డాయని రాసి ఉంది. నిర్గమకాండములో ఎర్ర సముద్రం ప్రాముఖ్యం ఎంతో ఉంది. ఈ సముద్రానికి ఈ పేరెందుకు వచ్చింది ? ఈ సముద్రతీరం వరకు ఏశావు సంతతి వ్యాపించి ఉంది. ఏశావు అనగా ఎదోము, ఎర్రనివాడు అని అర్థం. ఏశావును బట్టి ఆసముద్రానికి ఎర్రసముద్రం అని పేరు వచ్చింది. ఎదోము అనగా ఏశావు ! ఇతనికి చెందిన భూములు ఎర్రసముద్రతీరం వరకు విస్తరించి ఉన్నాయి. ఎర్రసముద్రం ఈజిప్టును అరేబియాను వేరు చేస్తుంది. దక్షిణ గాలులు ఎర్ర సముద్రం మీద విపరీతంగా విస్తూంటాయి. అక్టోబర్ నుండి మే వరకు ఈ గాలులు ఎక్కువవుతూనే ఉంటాయి. ఆ తరువాత తూర్పు గాలులు మొదలౌతాయి. సోదరీ సోదరులారా ! ఈపది తెగుళ్ళలో రెండు రకాల అద్భుతాలు ఇమిడి ఉన్నాయి. తెగులు రప్పించటం అద్భుతం. దానిని తొలగించటం కూడ అద్భుతమే. మాంత్రికులు కొన్ని తెగుళ్ళు రప్పించగలిగారు గాని ! వాటిని తొలగించలేక పోయారు. ఈ అద్భుతలు మోషే ద్వారా జరిగాయి గానీ జరిగించిన వాడు దేవుడు. మోషే చేతిలోని కర్ర సాంకేతికంగా దేవుని పట్ల అతనికి ఉన్న విధేయతను సూచిస్తుంది. అనగా మోషేకు దేవుని బలమే ఆధారం. ప్రతిసారి కర్రను పరలోకం వైపు చాచాడు.

*(మిగతా వచ్చే సంచికలో)*

# ప్రార్థన వేదిక

1. టి. సువర్ణరాజారత్నం-కడప
కుటుంబ ఆదరణకోసం
2. కె. దీనజ్యోతి-కడప
బ్లెస్సీ భవిష్యత్ కోసం
3. కె. ఫణిరాజు- రాజమండ్రి
తమ్ముని ఆరోగ్యం కోసం
4. ఎ. మార్తమ్మ- హైదారబాద్
ఆరోగ్యం కోసం
5. పి. మేరి- కర్నూలు
కెజియామేరి, సుష్మల కోసం
6. బి. ప్రేమలీల- గుంటూరు
మనవడి ఆరోగ్యం కోసం
7. బి. నాగేశ్వరావు-గుంటూరు
మెర్సిరజని వివాహం కోసం
8. జి. సుబ్బారావు- భీమడోలు
కుటుంబసమస్యల కోసం
9. పి. సౌదామని-భద్రాచలం
కుమారుని మారుమనస్సు కోసం
10. పి. ఎస్తేరురాణి-హైదారబాద్
కుటుంబ ఆత్మీయ ఎదుగుదల కోసం
11. యం. సుధీర్-మంగళగిరి
ఫిట్సు వ్యాధినుండి స్వస్థత కోసం
12. పి.వి.రమణమ్మ-ప్రత్తిపాడు
ఆర్థిక సమస్యల కోసం
13. ఎ. శాంతకుమార్-నాగులపురం
అమ్మ ఆరోగ్యం కోసం
14. యం. జయమ్మ-అనంతపురం
స్నేహ, ఆకాష్ల చదువుల కోసం
15. యం. మోహన్‌రావు-అడ్డతీగల మం॥
చేయుచున్న సేవ కోసం
16. యం. సుందర్రావు-హైదారబాద్
కుమారుని మారుమనస్సుకోసం
17. సుభాషిణి- ఏలూరు
ఆరోగ్యం(పక్షవాతం) కోసం
18. కె. ఆనంద్‌కుమార్-రాజమండ్రి
సంతానం కోసం
19. జి. యోహాను-కలశపాడు
ప్రవీణ్‌కుమార్ కోసం
20. శారాఅబ్రహాం-కాకినాడ
కుటుంబ సమస్యల కోసం
21. జి.సుభాషిణి-బనగనాపల్లి
కుటుంబము కోసం
22. ఆర్.యల్.రావు-విశాఖపట్నం
కుమార్తె(ఇందిర) కుటుంబము కోసం
23. బి.రత్నమ్మ-కడప
కుటుంబ ఆదరణ కోసం
24. ప్రేమలత- బెంగుళూరు
భర్త మారుమనస్సు కోసం
25. జి.పాల్-కలశపాడు
కుడి కన్ను స్వస్థత కోసం
26. అరుణమ్మ-హింధుపూర్
కుటుంబ సమస్యల కోసం
27. రాయల గౌరేష్ - గుంటూరు జిల్లా
పార్వతికి సంతానం కోసం
28. కె. దుర్గరావు-రెంటచింతల
కుటుంబ ఆరోగ్యం కోసం
29. కె. సర్వేశ్వరావు-విజయవాడ
కుమార్తె వివాహం కోసం
30. యన్. అన్నమ్మ-శ్రీకాళహస్తి
కుమార్తె మారుమనస్సు కోసం

# విధేయత

## బాల స్పందన



- పి. సురేశ్

"పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులైయుండుడు". ఎఫెసీ 6:1

పిల్లలూ బాగున్నారా! మీకో మంచి కథ చెబుతాను. సరేనా?!అనగనగా ఒక అడవి. అడవిలో ఏఏ జంతువులుంటాయో మీకు తెలుసు కదా. ఏది చెప్పండి చూద్దాం. పులులు, సింహాలు, ఏనుగులు, కుందేళ్ళు, తాబేళ్ళు, కోతులు ఇంకా ఇలా ఎన్నో జంతువులు ఉంటాయి కదా. సరే ఈ అడవిలో కూడా చాలా జంతువులు ఉన్నాయి. ఒక మంచి 'మంకీ' ఫ్యామిలీ కూడా ఉంది. అదేనర్రా తల్లి కోతి, తండ్రి కోతి వారికి చిన్ని పిల్లకోతులు రెండు ఉన్నాయి. ఈ పిల్లకోతులు పేర్లేమిటంటే సోను, మోను. ఒకరోజు ఏమయ్యిందంటే ఈ సోను మోనులు ఇంటిదగ్గర ఆడుకొంటున్నాయి. ఏ ఆటో తెలుసా? బంతాట. అంటే బంతిని విసురుతూ పట్టుకుంటూ ఆడుకొంటున్నాయి. కాసేపటకి వాటికి బయటకు వెళ్ళి ఆడుకోవాలనిపించింది. సోను వాళ్ళ మమ్మి దగ్గరకు వెళ్ళి "మమ్మి మేము బయటకు వెళ్ళి ఆడుకుంటామని" చెప్పింది. వాళ్ళ మమ్మి "వద్దు వద్దు ఈ అడవిలో చాలా ఊబులున్నాయి. వాటిలో పడితే చాలా ప్రమాదం. ఇక్కడే మన ఇంటి దగ్గరే ఆడుకోండి" అని చెప్పింది. వారు నిరాశగా వెళ్ళి వారి ఇంటి దగ్గరలోనే ఆడుకోసాగారు. కొద్దిసేపటికి వారి మమ్మి ఇంటి లోపలికి వెళ్ళింది. ఇది గమనించిన సోను మోనుతో "మమ్మి ఇంటిలోనికి వెళ్ళిపోయింది. మనం బయటకు వెళ్ళి ఆడుకుందాం పద" అని అంది. దానికి మోను కొంచెం భయపడుతూ "మమ్మి చూస్తే తిడుతుందేమో" అంది. ఏం పర్వాలేదు నేనున్నానుగదా, పద వెళ్దాం. అంటూ సోను, మోనును తీసుకొని వెళ్ళింది. ఇంటికి దూరంగా చెట్లపై ఊగుతూ బంతి ఒకరికి ఒకరు విసురుకుంటూ అనందంగా ఆడుకోసాగారు. అలా ఆడుతూ ప్రమాదకరమైన ఒక ఊబి దగ్గరలోనికి వెళ్ళిపోయారు. సోను ఒక చెట్టుపై మోను ఒక చెట్టుపై ఉండి బంతిని ఒకరికి ఒకరు



విసురుతూ గెంతులు వేస్తున్నారు. వీరిద్దరు ఉన్న ఆ రెండు చెట్లకు మధ్యలోనే ఉంది ఆ ఊబి. "మోను క్యాచ్" అంటూ బంతిని ఈ చెట్టుమీదనుండి అవతల చెట్టుపై ఉన్న మోను వైపు విసిరింది సోను. మోను ఆ బంతిని పట్టుకొని "సోను క్యాచ్" అంటూ సోను వైపు విసిరింది. ఇలా విసురతూ ఉండగా బంతి జారి ఆ మద్యలో ఉన్న ఊబి పై పడింది. ఇద్దరు క్రిందకు దిగి ఆ ఊబి దగ్గరకు వచ్చి బంతివైపు చూస్తూ ఒకరి ముఖం ఒకరు చూస్తు ఉండిపోయారు.

"ఇప్పుడెలా మమ్మి తిడుతుందిగా, ఇంటి దగ్గరే ఉండి ఆడుకుంటే బాగుండేది" అంది మోను. సోను "నువ్వేం భయపడకు, నేనున్నాను గదా." అంది.

సోను చుట్టూ చూసింది. బంతి తీయడానికి ఎదైన కర్ర దొరుకుతుందేమో అని. ఏమి కనబడలేదు. చివరకు తనే ఎలాగైనా దిగి తీయాలని "మోను నువ్వు నావెనుక ఉండి నా తోకను గట్టిగా పట్టుకో నేను చిటికెలో ఆ బంతిని అందుకుంటా". అంటూ నిదానంగా ఊబిలోకి అడుగువేసి బంతిని అందుకోవడానికి చేయిచాపింది. బంతి అందలేదు. "మోను గట్టిగా పట్టుకో" అంటూ ఇంకొంచెం ముందుకు వంగింది సోను. ఇంతలో మోను చేతిలోని సోను తోక జారిపోయింది. సోను ఒక్కసారిగా ముందుకు పడిపోయి ఊబి మద్యలోనికి జారిపోయింది. ఇక మోను పెద్ద కేకలు వేయసాగింది. సోను ఊబిలో గజగజా వణుకుతూ బయటకు రావడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది, గాని ప్రతి ప్రయత్నానికి కొంచెం కొంచెం క్రిందకు దిగిపోసాగింది. ఇక ఏడుస్తూ తల సగం వరకు ఊబిలోనికి వెళ్ళగానే స్పృహ కోల్పోయింది. మోను ఇంకా గట్టిగా అడవంతా దద్దరిల్లేలా కేకలు పెట్టింది. అంతే అడవిలో ఉన్న జంతువులన్నీ పరుగు పరుగున ఆ ఊబి దగ్గరకు చేరుకున్నాయి. సోను మోనుల మమ్మి డాడీలుకూడా వచ్చి సోనును చూసి ఎంతో దుఃఖించాయి. ఇంతలో ఏనుగు ఒకటి ముందుకు వచ్చి "మీరేం కంగారుపడకండి" అంటూ మీరందరూ నేను చెప్పినట్టు చేయండి. మీరంతా నా వెనుకగా వచ్చి ఒకరి తోక ఒకరు పట్టుకొని నన్ను గట్టిగా పట్టుకోండి" అని చెప్పింది. జంతువులన్నీ ఆ విధంగా చేయగానే ఏనుగు ముందుకు వంగి తన బారైన తొండం చాపి సోను తలను పట్టుకొని బయటకు లాగి నేలపై పడుకోబెట్టింది. కొద్దిసేపటికి సోను నిదానంగా కళ్ళు తెరచి "నేను బ్రతికే ఉన్నానా" అంటూ లేచి చుట్టూ చూసింది. జంతువులన్నీ ఒకదాని తరువాత ఒకటి సోను దగ్గరకు వచ్చి మీ మమ్మీ మాట విని ఇంటి దగ్గరే ఆడుకుంటే ఇంత ప్రమాదం జరిగేది కాదు కదా అని మందలించి వెళ్ళిపోయాయి.

పిల్లలూ చూశారా తల్లిదండ్రులు చెప్పిన మాట వినకపోతే ఎలా ప్రమాదాలు వచ్చి పడతాయో. దేవుడు తల్లిదండ్రులకు లోబడి విధేయత చూపాలని మనకు బైబిల్ ద్వారా తెలియపరుస్తున్నాడు. ఈ రోజునుండి మీరంతా మీ మమ్మి డాడిల మాట చక్కగా వింటారు కదూ. బై.., బై., సీయు.

# అక్టోబర్ గళ్ళనుడికట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | |
| | | | | 5 | | | | | 6 |
| | | 7 | | | | | | | |
| 8 | 9 | | | | | 10 | | | |
| | 11 | | | | 12 | | | | |
| | | | | 13 | | | | 14 | |
| | 15 | | | | | | 16 | | |
| 17 | | | | | | 18 | | | |
| | | | 19 | | | | | | |
| | | 20 | | | | | 21 | | |

**సూచనలు**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరించబడవు.
2. పూర్తి చేసిన గ.ను.క. అక్టోబర్ 20 లోపు మాకందేటట్లు పంపాలి.

పూర్తిచేసి పంపిన వారి పేరు : ....................................................................................................

స్పందన కోడ్ : ....................................................................................................

## • అడ్డం

1. యాకోబు వేగము - - - - వేగము వంటిది. (సంఖ్యాకాండము)
3. ఇశ్రాయేలీయుల నాల్గవరాజు- - - -. దావీదు మనుమడు. (2వ దినవృ)
7. బుద్ధిహీనుల నవ్వు బాన క్రింద చిటపటయను - - - - మంట వంటిది. (సామెతలు)
8. విశ్రాంతి దినమున - - చేయుట ధర్మమా? కీడు చేయుట ధర్మమా? (మార్కు) (తలక్రిందులు)
10. షేము కుమారులలో ఒకడు - - - -. నోవహు మనుమడు. (ఆదికాండము) (తలక్రిందులు)
11. దాని - - - హిమము కన్న శుద్ధమైన వారు. (విలాప)
12. కంచరగాడిద నీ దగ్గరకు తేబడునట్లు దాని నోరు - - తోను కళ్ళెముతోను బిగింపవలెను. (కీర్తనలు 1-50)
15. రాజైన యెషీయా బార్య పేరు - - - - (2రాజులు)

16. బంగారు ప్రతిమ ---కు నెబుకద్నెజరు అధికారులందరిని పిలిపించెను. (దానియేలు)

17. యెహోషువ తండ్రి పేరు --.

19. దేవదూతలు సొదొమవారికి ---- కలుగజేయగా వారు ద్వారమును కనుగొనలేకపోయిరి. (ఆదికాండము)

20. --కాలము పాపభోగము అనుభవించుట కంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలు (హెబ్రీ)

21. భార్య నిమిత్తమై ఇశ్రాయేలు --- చేసెను. (హోషేయ)

## • నిలువు

1. యేసును పట్టుకొనుటకు జనసమూహము ---- పట్టుకొని గెత్సేమనే తోటకు వచ్చిరి. (మత్తయి)

2. క్రీస్తు సంఘమును --- సంరక్షించుచున్నాడు. (ఎఫెసీ)

4. క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు ----కుడాయెను. (గలతీ)

5. ప్రిస్కిల్ల భర్త పేరు ---.

6. ---- లోను పగలు మేఘములోను మీకు ముందర నడచిన మీ దేవుని యందు మీరు విశ్వాసముంచలేదు. (ద్వితీయో)

9. యెషూరూనూ నీకు సహాయము చేయుటకు దేవుడు మహోన్నతుడై -- ---- అగును. ఇశ్రాయేలియులకు మోషే దీవెన. (ద్వితీయో)

10. ధనవంతుడు --- గా ప్రత్యుత్తర మిచ్చును. (సామెతలు)

13. యవలకు ప్రతిగా ---- మొలుచును గాక. (యోబు చివరిమాటలు)

14. వీరు ఖర్జూరవృక్షమువలె మొవ్వవేయుదురు. -----. (కీర్తనలు 51-100)

18. జనులు మత్తుగా ఉన్నప్పుడు --రసము పోయుదురని విందు ప్రధాని అన్నాడు. (యోహాను)

19. సత్యమునకు చెవినియ్యక -- నా కథలవైపునకు తిరుగు కాలము వచ్చును. (తిమోతి)

## సెప్టెంబర్ గ.ను.క జవాబులు

**అడ్డం ■**

1. అమరత్వము 4. షాలేము 6. తేరి (తలక్రిందులు) 8. కహాతు 9. పాము (తలక్రిందులు) 11. జనులగు 13. సాధు 17. సమరయ 19. జతలుగా 21. లిపి 23. త్రోయ 24. వడకను 26. హేను

**నిలువు ■**

1. అల్లరి 2. రగూ 3. ముతకగుడ్డ 4. షాపతు 5. ముఖము 7. తేజస్సు 10. పాశము 12. గోధుమలు 14. మూస 15. కయప 16. రాజదండము 18. మరియ 20. గాలి 22. పిరికి 23. త్రోసి 25. నులి

Regd. No. VJ/057/2006-2008 RNI No. 321106/76
LICENCED TO POST WITHOUT PRE-PAYMENT
PMG/VJ/PWPP/9/2006-2008 dtd/8-3-2006 at Vijayawada-10


# మీరు తప్పక వినాల్సిన ఆధ్యాత్మిక భక్తిగీతాలు




1) దేవగానాలు - 1
2) దేవగానాలు - 2
3) విజయ గీతాలు
4) నవజీవన రాగమాలిక
5) నాతిచరామి
6) ప్రత్యూష పవనాలు
7) సీయోను గీతాలు



ప్రసంగాలు



1) ఆరార్కే మరియు దేవ గారి టి.వి. ప్రోగ్రామ్ వి.సి.డి., డి.వి.డిలు.
2) ఆరార్కే గారి యెషయ గ్రంథ వ్యాఖ్యానం వి.సి.డి., డి.వి.డిలు.

మరిన్ని వివరాలకు

స్పందన, పోస్ట్ బాక్స్ 415, విజయవాడ - 2.
ఫోన్: 2456547, సెల్: 9346616347